ప్రజాశక్తి



పిల్లల పండగకు విశేష స్పందన

- పాల్గొన్న అందరూ విజేతలే - కర్నూలు బాలోత్సవం ముగింపు సభలో వక్తలు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

పిల్లల పండగకు విశేష స్పందన లభించింది. రెండు రోజులపాటు మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో కళ్యాణమ్మ కళావేదిక, సత్యనారాయణ రెడ్డి కళావేదికపై 12 అంశాల్లో పోటీలు నిర్వహించారు. మొదటి రోజు 1200 మంది, రెండో రోజు 800 మంది చిన్నారులు బాలోత్సవంలో పాల్గొన్నారు. పాఠశాలల నుంచి బాలోత్సవంలో పాల్గొన్న అందరూ విజేత లేనని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ బి శంకర శర్మ, ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ భరత్, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాల జిల్లా అధ్యక్షులు పివిబి సుబ్బయ్య పేర్కొన్నారు. కర్నూలు బాలోత్సవం ముగింపు సభను మంగళవారం మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలోని కళ్యాణమ్మ కళావేదికపై బాలోత్సవం కన్వీనర్ ఎంపీ బసవరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేయడం సులభం కాదన్నారు. సరైన వసతులు లేకుండానే అనేక పాఠశాలలు నడుపుతున్నారని తెలిపారు. మంచి మార్కుల కోసం చదవాలని ముందు నుంచి విద్యార్థులపై రుద్దుతున్నారని అలాంటి ఘోరమైన పరిస్థితుల్లో ఇలాంటి కార్యక్రమాల ద్వారా చిన్నారులకు మానసిక వికాసం పెరుగుతుందని తెలిపారు. సంగీతం, నత్యం ద్వారా సేదతీరవచ్చన్నారు. పోటీలో గెలవలేకపోయినా ఆ స్ఫూర్తి ముఖ్యమని అన్నారు. డాక్టర్ భరత్ మాట్లాడుతూ వందలాది మంది విద్యార్థులను సమన్వయం చేయడం సామాన్యమైన విషయం కాదని తెలిపారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఒత్తిడి నివారణ సామర్థ్యం వస్తుందన్నారు. చిన్న వయసు నుంచి ఏదో ఒక అలవాటుని చేసుకోవాలన్నారు. నైపుణ్యానికి చిన్న వయసు నుంచే పునాది పడాలని తెలిపారు. పోటీల్లో ఇప్పుడు గెలవలేకపోయినా భవిష్యత్తులో తప్పకుండా గెలుస్తారని చెప్పారు. పివిబి సుబ్బయ్య మాట్లాడుతూ కళ్యాణమ్మ విద్యా లోకానికే అధినేత అని తెలిపారు. అవకాశం ఉన్న మేరకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని, అందరినీ ఏకం చేసి నిర్వహించే బాలోత్సవానికి అందరూ సహకరించాలని కోరారు. ఇలాంటి కార్యక్రమాలను అందరూ ప్రోత్సహించాలని, తమ వంతు సహకారం చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మాంటిస్సోరి ఇండస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనాక్షి విల్సన్ మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన లేకపోయినా ఇక్కడికి వచ్చిన విద్యార్థులు వారి పాఠశాలల నుంచి వచ్చిన ఉత్తమ విద్యార్థులని తెలిపారు. ఇతరులు గెలిచారంటే మనకంటే వారు ముందున్నారని అర్థం చేసుకోవాలన్నారు. బాలోత్సవానికి విశేష స్పందన లభించిందన్నారు. బహుమతి రానివారు మరో ఏడాది ప్రయత్నం చేయాలన్నారు. అనంతరం గెలుపొందిన 90 మంది చిన్నారులకు మొమెంటోలను అతిథులు బహుకరించారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బాలోత్సవం కార్యదర్శి జె ఎన్ శేషయ్య, సమత కన్వీనర్ రమాదేవి, సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి బసప్ప, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎం జయరాజు, కర్నూలు చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ ఉమ, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఖాజా, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి శిరీష, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం నాయకులు రంగస్వామి, బాలోత్సవం కన్వీనర్లు కెంగార మోహన్, ఈశ్వరయ్య, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్, మీడియా కన్వీనర్ ఎంయు వినయ్ కుమార్, యుటిఎఫ్ నాయకులు యు ఆర్ ఏ రవికుమార్, హేమంత్, ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి పాల్గొన్నారు.

విద్యార్థులను బహుమతులను అందజేస్తున్న గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ బి శంకర శర్మ, ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ భరత్, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాల జిల్లా అధ్యక్షులు పివిబి సుబ్బయ్య

మాట్లాడుతున్న గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ బి శంకర శర్మ

పాటలు పాడుతున్న చిన్నారులు

ఉన్నత విద్యకు పదవ తరగతి తొలి మెట్టు : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉన్నత విద్యకు పదవ తరగతి అనేది తొలి మెట్టు లాంటిదని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం నగరంలోని ప్రభుత్వ టౌన్ మోడల్ హై స్కూల్ నందు విద్యార్థులకు ఏర్పాటు చేసిన మోటివేషన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థులు తమ ఉపాధ్యాయులను మనం ముందుగా గౌరవించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు నిత్యం విద్యార్థుల ఉన్నతి కోసం కృషి చేస్తూ వారికి మంచి మార్కులు తెప్పించే దిశగా కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులు ఒక్కరూ కూడా ఫెయిల్ కాకుండా చదువుకోవాలన్నారు. చాలా మంది తల్లిదండ్రులు ఎంతో కష్టపడి వారిని చదివిస్తున్నారని మీ తల్లిదండ్రుల కష్టాన్ని విద్యార్థులు గుర్తుపెట్టుకొని ఉన్నత లక్ష్యాలు సాధించే దిశగా ఉండాలన్నారు. ఏప్రిల్ 3వ తేది నుండి పరీక్షలు ఉన్నందున ప్రతి రోజు రెండు మార్కులు చొప్పున చివరి గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులు పై గ్రేడ్‌లకు వెళ్లేలా ప్రయత్నించాలన్నారు. పదవ తరగతి పాస్ అయిన తరువాత ఎన్నో మార్గాల ద్వారా ఉన్నత చదువులకు అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులకు అవసరమైన వన్ని ప్రభుత్వం అందించడంతో పాటు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. పదవ తరగతి విద్యార్థులు ఈ ఒక్క నెలకు ప్రణాళిక రూపొందించుకొని చదవాలన్నారు. అదే విధంగా సి, డి గ్రేడ్‌లలో ఉన్న విద్యార్థులకు అవసరమైన మెటీరియల్‌ను అందించడంతో పాటు గ్రూపుల వారీగా విద్యార్థులను విభజించుకొని వారు తప్పకుండా ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయులతో జిల్లా కలెక్టర్ సమావేశమై విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా వారితో చర్చించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ హనుమంతరావు, హెడ్ మాస్టర్ రాజకుమారి, ఇంచార్జి హెడ్ మాస్టర్ ఇనాయతుల్లా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి. కోటేశ్వర రావు

ఎపిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

పెండింగు వేతనాలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పెండింగ్ లో ఉన్న లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ సిక్ లీవ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఎపిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ కార్యదర్శి ముత్యాల రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూల్ 2 డిపోలో డిపో కార్యదర్శి జి. మహేశ్వర్‌రావు అధ్యక్షతన సిబ్బంది అందరూ డిమాండ్ బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జి.మహేశ్వర రావు మాట్లాడుతూ గతంలో డ్రైవర్లు, కండక్టర్లకు రోజు అధికంగా చేసే పని గంటలు లెక్కించి వారికి రావలసిన ఓటి మొత్తం నైట్ అవుట్ అలవెన్స్ జీతంతో కలిపి ఇచ్చేవారన్నారు. ప్రభుత్వ స్కేలు అమలైన తర్వాత అదనపు పని గంటలకు, ఇతర ప్రాంతాల్లో నైట్ అవుట్ చేస్తే ఇచ్చే నైట్ అవుట్ అలవెన్స్, గ్యారేజ్ కార్మికులకు ఇచ్చే బకాయిలు రావడం లేదని అన్నారు. ఆరునెలల నుంచి ఇదే విధంగా పెండింగ్ పెట్టారని, అదేవిధంగా సిక్ చేస్తే ఇచ్చే సిక్‌లీవుల వేతనాలు ఇవ్వడం లేదన్నారు. లీవ్ ఎన్ క్యాష్ మెంట్ కూడా చాలా రోజులుగా పెండింగులో ఉన్నందున వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమం ఈరోజు రేపు రెండు రోజులు ఉంటుంది.

ఈ కార్యక్రమంలో రీజనల్ కోశాధికారి ముత్యాల రెడ్డి, జాయింట్ సెక్రటరీ కృష్ణారెడ్డి, డిపో అధ్యక్షులు జివి.రెడ్డి, డిపో కోశాధికారి శివకేశన్న, సుబ్బయ్య, ఆనందు, సుభాకర్, భాస్కర్, వీరేష్, రామకృష్ణ, శివయ్య, 120 మంది సిబ్బంది బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయండి

- రిటర్నింగ్ అధికారి కేతన్ గార్గ్

వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి కేతన్ గార్గ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు సిద్ధం చేయాలని రిటర్నింగ్ అధికారి, అనంతపురం ఇంఛార్జి జిల్లా కలెక్టర్ కేతన్ గార్గ్ సంబంధిత జిల్లా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన శాసనమండలి పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కడప- అనంతపురం- కర్నూలు జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల బ్యాలెట్ పేపర్ల పంపిణీ మార్చి 11న చేపడతామన్నారు. బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్, పంపిణీ అనంతపురం కలెక్టరేట్ నుండి మార్చి 11వ తేదీ ఉదయం 09.00గంటల నుండి పంపిణీ చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి ఐదు జిల్లాల నుండి సంబంధిత జిల్లా ఎన్నికల అధికారి అథారిటీ లెటర్లతో అధికారులను అనంతపురానికి పంపి బ్యాలెట్ పేపర్లను తగిన బందోబస్తుతో తీసుకెళ్లాల్సిందిగా సూచించారు. అదే విధంగా పోలింగ్ స్టేషన్ లకు బ్యాలెట్ పేపర్లను పంపాల్సి ఉంటుందన్నారు. శాంతి భద్రతలు, బందోబస్తు ఏర్పాట్లను ఆయా జిల్లాల ఎన్నికల అధికారి ఎస్‌పిలు కలిసి చేపట్టాల్సి ఉంటుందన్నారు.. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు. బ్యాలెట్ బాక్స్‌ల ప్రొక్యూర్‌మెంట్, ఇతర ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పనులన్నింటిని ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు చేపట్టాలన్నారు. ఆబహిరంగ సభలు, ర్యాలీలు, వాహనాలకు అనుమతి కొరకు జిల్లా కేంద్రంలో సింగల్ విండో సిస్టం ఏర్పాటు చేసుకోవాలన్నారు. అందుకు ఆయా జిల్లాలకు సంబంధించి సంబంధిత జిల్లా ఎన్నికల అధికారి అనుమతులు జారీ చేస్తారన్నారు.పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఓటర్లకు ఓటర్ స్లిప్పులను ఈరోజు నుండి అనంతపురంలో పంపిణీ చేస్తున్నామన్నారు. ఇతర జిల్లాలు కూడా మార్చి 7వ తేదీ లోపు ఓటర్ స్లిప్పులను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్ స్లిప్పులు సంబంధిత ఓటర్లకు మాత్రమే బూత్ లెవెల్ అధికారులు ఇచ్చి వారి నుండి సంతకం తీసుకునేలా తగు ఆదేశాలు జారీ చేయాలన్నారు. మార్చి 13వ తేదీ ఎన్నికలు పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్స్‌లను వారు ఏర్పాటు చేసుకున్న స్ట్రాంగ్ రూములలో భద్రపరచుకోవాలన్నారు. అనంతరం మార్చి 14న అనంతపురంలోని జెఎన్‌టియు లో రిసెప్షను, కౌంటింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఆయా జిల్లాల నుంచి బ్యాలెట్ బాకులకు తగిన బందోబస్తుతో ఇక్కడికి చేర్చాలన్నారు. ఆ వచ్చిన సిబ్బందికి కౌంటింగ్‌పై మార్చి 15వన శిక్షణ ఇస్తామన్నారు. వారంతా 16 నాటికి కౌంటింగ్‌లో పాల్గొంటారన్నారు. కౌంటింగ్ సెంటర్లో ఆరు జిల్లాలకు సంబంధించి ఆరు స్ట్రాంగ్ రూములు గ్రాడ్యుయేట్లకు, మూడు స్ట్రాంగ్ రూములు టీచర్లకు ఏర్పాటు చేశామన్నారు. తదనంతరం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డిఆర్ఒ నాగేశ్వరరావు మాట్లాడుతూ పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు మార్చి 1 వ తేదీ, 6 వ తేదీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంసిసి, ఫ్లైయింగ్ స్క్వాడ్, ఎంసిఎంసి టీమ్ లు ఏర్పాటు చేశామని రిటర్నింగ్ అధికారికి వివరించారు. బహిరంగ సభలు, ర్యాలీలు, వాహనాలకు అనుమతి కొరకు జిల్లా కేంద్రంలో సింగల్ విండో సిస్టం టీమ్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కింద రూ.59.06 కోట్లు జమ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వైఎస్ఆర్ రైతు భరోసా, పిఎం.కిసాన్ పథకం కింద జిల్లాలో 2,79,576 మందిరైతులకు రూ. .59.06 కోట్లు లబ్ధి చేకూరిందని వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం వైఎస్ఆర్ రైతు భరోసా-పిఎం కిసాన్ పథకం కింద నాలుగో ఏడాది మూడవ విడత సాయాన్ని బటన్ నొక్కి సిఎం వైఎస్.జగన్ మోహన్ రెడ్డి రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వ్యవసాయశాఖ అధికారి వరలక్ష్మి, అనుబంధ శాఖల అధికారులు, రైతులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి మాట్లాడుతూ వైఎస్ఆర్ రైతు భరోసా - పిఎమ్.కిసాన్ పథకం కింద రైతులకు వరుసగా నాలుగో ఏడాది మూడవ విడత రైతు భరోసా లబ్ధిని ప్రభుత్వం జమ చేసిందని, ఇందులో భాగంగా జిల్లాలో 2,79,576 మంది రైతు కుటుంబాలకు రూ.59.06 కోట్లు నేరుగా రైతుల ఖాతాలలోకి జమ అయిందని వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి పేర్కొన్నారు. జిల్లాలో యాజమాన్యపు హక్కులు ఉన్న రైతులు 2,75,799 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.2,000-00 చొప్పున రూ.55.15 కోట్లు, ఆర్ఒఎఫ్ ఆర్ పట్టాలు ఉన్న 04 మంది రైతులకు ఒక్కొకరికి రూ.2,000-00 చొప్పున రూ8 వేలు, కౌలు రైతు 3,690 మంది రైతులకు రూ.2 కోట్ల 61 లక్షలు మొత్తం 2,79,576 మంది రైతులకు రూ.59.06 కోట్లు జమ చేశామన్నారు.అనంతరం మెగా చెక్కును రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఎపిఎంఐపి పిడి ఉమాదేవి, పశు సంవర్ధక శాఖ అధికారి రామచంద్రయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట నారాయణ, రైతులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లు దంపతులను సన్మానిస్తున్న సహోద్యోగులు, అభిమానులు

వెంకటేశ్వర్లు సేవలు వెలకట్టలేనివి

ఉద్యోగ విరమణ సభలో వక్తలు

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ ఎస్‌టిఒ వి.వెంకటేశ్వర్లు ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షనర్లకు వివిధ శాఖలకు అందించిన సేవలు మరువలేనివని పెన్షన్ దారుల సంఘం ప్రెసిడెంట్ టిఎండి హుస్సేన్, ఎన్‌జిఒ సంఘం ప్రెసిడెంట్ సాయి బాబా కొనియాడారు. మంగళవారం సబ్ ట్రెజరీ కార్యాలయంలో సభాధ్యక్షులు ఆలూరు ఎస్‌టిఒ డి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో పత్తికొండ ఎస్‌టిఒ బి .వెంకటేశ్వర్లకు స్వచ్ఛంద పదవీ విరమణ, సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వక్తులు మాట్లాడుతూ బి.వెంకటేశ్వర్లు 36 సంవత్సరాలు ఉద్యోగస్తులకు చేసిన సేవలు మరవలేనివని, తోటి ఉద్యోగస్తులను ప్రేమ అనురాగాలతో మాట్లాడించేవారని అన్నారు. వ్యక్తిగత అవసరాల కోసం పదవి విరమణ చేపడుతున్న బి వెంకటేశ్వర్లకు ఎల్లవేళలా తోటి ఉద్యోగస్తులు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బి వెంకటేశ్వర్లు దంపతులకు పత్తికొండ ఆర్‌డిఒ మోహన్‌దాసు పెన్షనర్ల సంఘం ఎన్‌జిఒ సంఘం నాయకులు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎన్‌జిఒ సెక్రెటరీ రమణ ఎంఇఒ రంగస్వామి, వైకుంఠ ప్రతాపు, జయరాములు వివిధ శాఖలు అధికారులు పెన్షన్ దారులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో ఇంకుడు గుంతలు తవ్వుకోండి

ప్రజాశక్తి- సి బెళగల్ : మండలంలో ప్రతి రైతు పొలంలో ఇంకుడు గుంతలను తవ్వుకోవాలని వ్యవసాయ జిల్లా అధికారిని వరలక్ష్మి అన్నారు. మంగళవారం సి.బెళగల్ లోని వ్యవసాయ కేంద్రంలో సాంకేతిక అధికారి అలీపిరా, ఎఒ మల్లేష్ కుమార్ అధ్యక్షతన సమీక్షించారు. పంటలపై గులాబీ రంగు పురుగు ఉధృతి తగ్గిందని అన్నారు. అలాగే నీటి వనరులను పెంచుకోవడానికి ఈ ఇంకుడు గుంతలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

సి.బెళగల్ మండలంలో 'అవీ - ఇవీ '

ప్రజాశక్తి -సి బెళగల్ : పలుకుదొడ్డిలో తెల్లవారుజామున బడేసాఖాన్ ఉరుసు గంధం ఘనంగా జరిగింది. దర్గాను దర్శించాలని ముజావర్లన్నారు. కొత్తకోట హైస్కూల్లో మాజీ ఎంపిటిసి రాజశేఖర్ సైన్స్ దినోత్సవం సందర్భంగా ల్యాబ్ గదులను ప్రారంభించారు. హెచ్ఎం.మధు, చైర్మన్ నాగమద్దిలేటి, పెద్దల సమక్షంలో సైన్స్ పై అవగాహన కల్పించారు. బురాన్ దొడ్డిలో గోకారమయ్య తాత దర్గా నేడు గంధం,రేపు ఉరుసు,ఎల్లుండి కిస్తీ మహోత్సవాలు జరగనున్నట్లు పెద్దలన్నారు.కృష్ణదొడ్డిలో నేడు పెద్దమ్మ దేవర ఉత్సవాల భాగంగా పారువేటను ప్రశాంతంగా చేసుకువాలని ఎస్ఐ పీరయ్య భక్తులకు సూచించారు.సి బెళగల్ లో మంగళవారం గద్దెరాళ్ళ మారెమ్మ నూతన ఆలయంలో నూతన విగ్రహ ప్రతిస్థాపన ఘనంగా జరిగింది.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

ఆకట్టుకున్న విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం నాడు జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలలు ఉన్నత విద్యాసంస్థల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రస్తుతం సైన్స్ లో వస్తున్న మార్పులపై విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైన్స్ పితామహుడు సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

రాయలసీమ వర్సిటీలో : రాయలసీమ యూనివర్సిటీలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. వర్సిటీ రెక్టార్ సివి.కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి చెందిన ఫిజిక్స్ ప్రొఫెసర్ సురేష్ పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వర్సిటీ రిజిస్ట్రార్ సుందరానందపుచ్చా సిడిసి డీన్ ఎస్తేరురాణి, ఎగ్జామ్స్ డీన్ విశ్వనాథరెడ్డి ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

సిల్వర్ జూబ్లీ కళాశాలలో: కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బివి సుబ్రహ్మణ్య కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా క్లస్టర్ వర్సిటీ వైస్ ఛాన్సలర్ డివిఆర్ సాయి గోపాల్ మాట్లాడారు. రిజిస్ట్రార్ డి.శ్రీనివాసులు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పురుషుల కళాశాలలో: ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో కూడా సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ. సత్యనారాయణ అధ్యక్షతన సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రవీంద్రలో 2కె23 : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని అబ్బాస్ నగర్ లోని రవీంద్ర విద్యాసంస్థల్లో ఘనంగా సైన్స్ డేను సినర్జీ 2కె23 పేరుతో నిర్వహించారు. వివిధ తరగతుల విద్యార్థులు వారు తయారు చేసిన సైన్స్ నమూనాలు చాలావరకు ఆలోచింపజేసే విధంగా, సృజనాత్మకంగా ఉన్నాయి. , రాబోయే రోజుల్లో కొత్త ప్రయోగాలకు నాంది పలికే విధంగా తయారు చేశారు. ఇక్కడ ఇంటర్ స్కూల్స్ కాంపిటీషన్ జరిగింది. రవీంద్ర విద్యానికేతన్ ,రవీంద్ర పబ్లిక్ స్కూల్ ,రవీంద్ర ఐసి విభాగాలలో పోటీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా రవీంద్ర విద్యాసంస్థల అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ జి.మమత మోహన్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి .పుల్లయ్య మాట్లాడారు. సైన్స్ అన్నది మానవాళి అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. ప్రతి పరిశోధక నమూనా ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని ప్రశంసించారు. విద్యాసంస్థల వైస్ చైర్మన్ జి .వంశీధర్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ నమూనాలుగా ఎంపికైన బ్లైండ్ స్టిక్ టతారక్ సంవిత్ ,వేదసాయి కీర్తన్). ఆర్ఎఫ్ఐడి డోర్ లాక్ సిస్టమ్(జి.జైత్రి సాయి మీనాక్షి, దివ్యశ్రీ)కి బహుమతులు , ప్రశంసాపత్రాలను అందజేశారు.

శ్రీచైతన్యలో : స్థానిక మాధవనగర్ లోని శ్రీనగర్ కాలనీలోని (కర్నూలు -4)శ్రీచైతన్య పాఠశాలలో " జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీచైతన్య విద్యాసంస్థల ఎజిఎం. సురేష్ , కోఆర్డినేటర్ నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎజిఎం సురేష్ విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ ఈ సైన్స్ ఎక్స్‌పో వల్ల విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఎంతో దోహదపడుతుందని చెప్పారు. కోఆర్డినేటర్ , పాఠశాల ఆర్ఐ రామాంజనేయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెహమూద, డీన్ దామోదర్, ఇంచార్జులు కృష్ణవేణి, రోజా, సైన్స్ ఉపాధ్యాయులు ప్రతిమ, ప్రవీణ్,శివజ్యోతి,రామకష్ణ గార్లు విద్యార్థులు ,తల్లిదండ్రులు పాల్గొన్నారు .

నారాయణ లో సైన్స్ ప్రదర్శన : మాధవ నగర్ లోని నారాయణ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఎటిఎం రమేష్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తా ఫ్ అధ్వర్యంలో జరిగిన సైన్స్ ప్రదర్శనకు డాక్టర్ మోక్షేశ్వరుడు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ ఐ దుర్గాలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వరి ముంతాజ్ బేగం, రాధ పాల్గొన్నారు.

కెవిఆర్ డిగ్రీ కళాశాలలో : స్థానిక కెవిఆర్ ప్రభుత్వ మహిళ కళాశాలలోని సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా శాంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాయలసీమ వర్సిటీ ప్రొఫెసర్ ఆర్. భరత్ కుమార్ పాల్గొన్నారు. సైన్స్ లోని వివిధ విభాగాల వారు విద్యార్థులకు వక్తృత్వ పోటీలు , వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ , ముఖ్య అతిథులు విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. వృక్ష శాస్త్ర అధ్యాపకులు జివి రంగారెడ్డి డాక్టర్ఎస్. సునీత, డాక్టర్ మైఖేల్ డేవిడ్ హెలెన్ కుమారి, డాక్టర్ శైలజ భవాని, జంతు శాస్త్ర అధ్యాపకులు డాక్టర్. లావణ్య, డాక్టర్. శంషాద్ హేమలత, తదితరులు పాల్గొన్నారు.

నారాయణలో

ఆర్‌యు సివి రామన్‌కు నివాళి అర్పిస్తున్న హెచ్‌యు ప్రొఫెసర్ సురేష్, తదితరులు

రవీంద్రలో సైన్స్ డేలో విద్యార్థులు



సిల్వర్ జూబ్లీ కళాశాలలో



కెవిఆర్ కళాశాలలో

తుగ్గలిలో విజ్ఞాన సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి-తుగ్గలి : మండలం పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ , కెజిబివి ,రాతన ఆశ్రమ పాఠశాల,నోవి పాఠశాల లో మంగళవారం సైన్స్ విజ్ఞాన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల సైన్స్ పరికరాలతో చేసిన బొమ్మలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. జొన్నగిరి విద్యా కమిటీ చైర్మన్ గుంత రాఘవేంద్ర మాట్లాడుతూ సైన్స్ పట్ల విద్యార్థుల్లో అవగాహన పెంచాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివితే దేనినైనా సాధించవచ్చునన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా విద్యను ఎంతగానో ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం సైన్స్‌లో ప్రదర్శించిన వారికి బహుమతులను అందజేశారు.

వార్డు సచివాలయాలను తనిఖీ చేసిన ఎసి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని వార్డు సచివాలయాలను మంగళవారం అదనపు కమిషనర్ పివి రామలింగేశ్వర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్‌ఆర్‌పేటలోని ఒకటి, రెండు, ప్రకాష్ నగర్ లోని 125, 126,130 సచివాలయాల్లో పనిచేసే సెక్రటరీల పనితీరును పరిశీలించారు. పిఎంజె ఎవై, ఎస్‌డిజి, హౌసింగ్ స్కీమ్ లు గురించి అడ్మిన్ లు,హెల్త్ సెక్రటరీలు, మహిళా పోలీసులు, వాలంటీర్ల పనితీరును పరిశీలించి సూచనలు చేశారు. పెండింగులో ఉన్న పనులన్నీ వీలైనంత త్వరలో పూర్తిచేయాలని ఆదేశించారు.

ప్లాస్టిక్ నిల్వలు ఉంటే చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి - ఆదోని

స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ సామాగ్రిని చూపిస్తున్న మున్సిపల్ కమిషనర్

ప్రభుత్వ నిబంధనలు విరుద్ధంగా ప్లాస్టిక్ సామాగ్రి నిలువ చేస్తే దాడులు చేసి సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయిస్తామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ హెచ్చరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధం విధించిన ప్లాస్టిక్ వస్తువులను కవర్లను, గ్లాసులను అరికట్టేందుకు దాడులు ఉధృతం చేస్తామన్నారు. మంగళవారం పట్టణంలోని గూడ్స్ గోదాములపై దాడి నిర్వహించి రూ.1.5 లక్షలు విలువచేసే ప్లాస్టిక్ గ్లాసులు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. నిషేధం విధించిన ప్లాస్టిక్ కవర్లను, గ్లాసులను అమ్మడం కొనడం నేరం అని అలా ఎవరైనా చేస్తే జరిమానులు విధిస్తామని కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ దాడుల్లో శానిటేషన్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాసులు, మంజునాథ్, శానిటేషన్, వార్డు సెక్రటరీలు ఉన్నారు.

సమస్యలను పరిష్కరించని సమావేశాలు ఎందుకు ?

- సర్వసభ్య సమావేశంలో ఎంపిటిసిలు, సర్పంచులు

ప్రజాశక్తి - ఆలూరు

పాఠశాలలో సబ్జెక్టు కు ఉపాధ్యాయులు లేరని ఎంఈఓ కు ప్రశ్నిస్తున్న వైస్ ఎంపిపి నాగవేణి

స్థానిక సమస్యలు పరిష్కరించలేని సమావేశాలు ఎందుకు అని ఆలూరు మండల ఎంపిటిసిలు, సర్పంచ్‌లు ప్రశ్నించారు. మంగళవారం ఎంపిపి రంగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ఎంపిడిఓ అల్లబకాష్, డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో కంప్యూటర్లు, ప్రింటింగ్ మిషన్, డివైస్‌లు, వాలంటీర్‌లకు సెల్‌ఫోన్‌లు పనిచేయడం లేదని ఎంపిటిసి నాగమ్మ, అధికారుల దృష్టికి తీసుకొవచ్చారు. స్థానిక మోడల్ స్కూల్‌లో ఇంతవరకు హిందీ సబ్జెక్టుకు ఉపాధ్యాయులు లేరని వైస్ ఎంపిపి నాగవేణి ఎంఈఓ దృష్టికి తీసుకొచ్చారు. కురుకుంద గ్రామంలోని అంగన్వాడీ సెంటర్ చుట్టూ ముళ్ళ చెట్ల మధ్యలో ఉందని సర్పంచ్ దేవిరెడ్డి మండిపడ్డారు. విద్యుత్, రైతుల బకాయిలకు, పొదుపు లోన్‌లకు లింకులు పెడుతూ రైతులను బ్యాంక్‌లు ఇబ్బంది పెడుతున్నారని తుంబలబీడు ఎంపిటిసి రమేష్ ఏపిఎం దృష్టికి తీసుకవచ్చారు. పై సమస్యలన్నింటికి సంబంధిత అధికారులు చూస్తాం, చేదాం అని సమాధానాలు తెలపడంతో ప్రజాప్రతినిధులు నిరుత్సాహపడ్డారు. ఎంపిడిఓ అల్లబకాష్ మాట్లాడుతూ ఆలూరు మండల సచివాలయాలలో ఏవైనా పాడైన వస్తువులను ఆ గ్రామ సర్పంచ్ నిధులు ఉంటే వాటితో ఖర్చు పెట్టి బిల్లు పెట్టుకోవాలన్నారు. లేదా దాతల సహాయంతో సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి - ఆదోని

నిరుద్యోగులు, ఉద్యోగులు అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే టీడీపీ పట్టభద్రుల ఎమ్మెల్యే అభ్యర్థి భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి కోరారు. మంగళవారం మండల పరిధిలోని పాండవగల్, కుప్పగల్, బల్లేకల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుండి నిరోద్యోగులను మోసం చేస్తూనే ఉన్నారని విమర్శించారు. ఉద్యోగులకు సరైన సమయంలో జీతాలు ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్ ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుద్ధారెడ్డి, జయరాం, మల్లి, పాండవగల్ అయ్యన్న, బసన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉన్నా.. కౌన్సిల్ సమావేశం

- కౌన్సిలర్ల జీతాల కోసమేనని ప్రచారం

ప్రజాశక్తి - ఆదోని

ఎన్నికల కోడ్ మినాయింపు పేపర్‌ను చూపిస్తున్న కమిషనర్

స్థానిక సంస్థల, పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నా.. ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం యధావిధిగా నిర్వహించారు. చైర్ పర్సన్ బోయ శాంత అధ్యక్షతన కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో పట్టణంలోని తాగునీటి సమస్యపై , పట్టణంలో వీధి కుక్కల సమస్యపై చర్చించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. అజెండా లేకుండానే సమస్యలపై చర్చించడం జరిగిందని ఎన్నికల కమిషన్ సైతం అత్యవసర సమావేశాలు నిర్వహించుకోవచ్చని అనుమతి ఇచ్చిందని అందువల్లనే కౌన్సిల్ సమావేశం నిర్వహించామని కమిషనర్ పేర్కొన్నారు. అయితే కౌన్సిల్ సమావేశ మందిరానికి విలేకరులు చేరుకున్న తర్వాత అర్ధాంతరంగానే సమావేశాన్ని ముగించారు. ఎన్నికల కోడ్ ఉన్నందువల్ల కౌన్సిల్ సమావేశానికి విలేకరులను ఆహ్వానించలేదని వచ్చిన వారు వెళ్ళిపోవాలని అధికారులు పేర్కొన్నారు. అంత రహస్య సమావేశం నిర్వహించాల్సిన అవసరం ఏముందోనని కొందరు విలేకరులు ప్రశ్నించారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి ఎన్నికల కమిషన్ ఇచ్చిన అనుమతి పత్రాన్ని విలేకరులకు అందజేశారు. అందులో కేవలం బడ్జెట్‌పై చర్చించాలని అలాగే అత్యవసరంగా అవసరమైతే మాత్రమే సమావేశాలు నిర్వహించాలని ఉండడం గమనర్హం. ఈ లేఖను అడ్డం పెట్టుకొని ఈ సమావేశం నిర్వహించడం ఎందుకో అర్థం కావడం లేదు. ఇందుకు అధికారుల నుంచి కానీ కౌన్సిలర్ నుండి గాని ఎలాంటి సమాధానం రాలేదు. అయితే మరి కొంతమంది కౌన్సిలర్ల జీతాల కోసమే అన్న విధంగా నామ మాత్రంగా ఎలాంటి అజెండా లేకుండానే కౌన్సిల్ సమావేశం నిర్వహించారని ప్రజల కోసం కాదని కౌన్సిలర్ల జీతాల కోసమేనని విమర్శలు వినిపిస్తున్నాయి. సమస్యలపై చర్చించుకోవాలంటే చైర్పర్సన్ ,కౌన్సిలర్లు, అధికారులు చర్చించుకోవచ్చని కానీ కౌన్సిలర్ల జీతాల కోసమే అనే విధంగా ఈ సమావేశం కొనసాగిందని కొందరు విమర్శించా రు. ఏది ఏమైనా ఎన్నికల కోడ్ ఉల్లంగించి మరి కౌన్సిలర్ల జీతాల కోసం ఆదోని కౌన్సిల్ సమావేశం నిర్వహించడం కొసమెరుపు.

అప్పర్ భద్ర నిర్మాణం ఆపాలి

- సీమ వాసుల బతుకులు తుంగభద్రపైనే ఆధారం
- ముఖ్యమంత్రి మేలుకోకుంటే పులివెందులలో భారీ బహిరంగ సభ

ప్రజాశక్తి - ఆదోని

మాట్లాడుతున్న రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

తుంగభద్ర ఎగువన నిర్మించే అప్పర్ భద్ర నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లో పూర్తి కానివ్వమని, కర్ణాటక రైతులతో కలిసి సుప్రీంకోర్టుకు వెళతామని రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర మంగళవారం ఆదోనిలోనే రిక్రియేషన్ క్లబ్ ఆవరణ లో ఆర్‌సిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజు అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహి ంచారు. ఈ సందర్భంగా బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడారు. ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి తన కేసులకు భయపడి ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణంపై నోరు మెదపడం లేదని రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా రాజోలి బండ నుంచి బైరెడ్డి చేపట్టిన మహా పాదయాత్ర మంగళవారం ఆదోనికి చేరుకుంది. రియిక్రేషన్ క్లబ్ ఆవరణంలో ఏర్పాటు చేసిన మహా బహిరంగ సభకు ఆయా ప్రాంతాల నుంచి రైతులు, ప్రజా సంఘులు, రాజకీయ నాయకులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన కేసులకు భయపడి కేంద్రంపై ఎగువ భద్ర ప్రాజెక్ట్ నిర్మాణం ఆపడానికి ప్రయత్నం చేయడం లేదని ఆరోపించారు. అనంతపురం, కర్నూలు, కడప ప్రాంత రాజకీయ నాయకులు హెచ్, ఎల్ సి, ఎల్ ఎల్ సి నుంచి తమ గొంతులను తడుపుతోందని గుర్తుంచుకోవాలన్నారు. సాగు, తాగు నీరు అందక పంటలు ఎండిపోయి అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకుంటున్న కనీసం పాలకులకు కనికరం లేదన్నారు. ఎమ్మెల్యేలు ఇప్పటికైనా మేల్కొండని లేకపోతే మీ రాజకీయ స్థిరత్వం కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మేలుకోకపోతే త్వరలో సీఎం నియోజకవర్గ పులివెందులలో రైతులతో కలిసి భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి కనువిప్పు కలిగిస్తామని అన్నారు. రాయలసీమను రక్షించాలని డిమాండ్ చేశారు. బళ్ళారి, రాయచూరు సింధనూరు విజయనగర్ కర్ణాటక రైతులు కూడా ఎగువ భద్ర నిర్మాణం పై వ్యతిరేకిస్తున్నారని అన్నారు. అంతకుముందు కర్ణాటక రాష్ట్రానికి చెందిన తుంగభద్ర నీటి వాట పరిరక్షణ సమితి సభ్యుడు పురుషోత్తం గౌడ్ మాట్లాడుతూ రైతులు మేలుకోకపోతే బళ్ళారి రాయలసీమ జిల్లాలకు నీరు అందే పరిస్థితి లేదని దీనిపై న్యాయ పోరాటాన్ని కలిసి రావాలని అన్నారు. నీటి వాటా పరిరక్షణ సమితి సభ్యుడు తప్పేంటి రామిరెడ్డి మాట్లాడుతూ త్వరలోనే సుప్రీంకోర్టుకు అప్పర్ బద్ర ఆపాలని వెళ్తామన్నారు రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై కోర్టుకు తెలియజేస్తామన్నారు. నీటి వాట పరిరక్షణ కమిటీ సభ్యుడు సాయిబాబు మాట్లాడుతూ తుంగభద్ర దిగుకాలకు 650 క్యూసెక్కులు నీటి ప్రవాహం ఉండాల్సి ఉండగా కేవలం 450 లోపే వస్తుందన్నారు. అప్పర్ బద్ర నిర్మాణం జరిగితే తాగు, సాగునీరు ప్రశ్నార్థకమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య, తిప్పారెడ్డి నాగార్జున రెడ్డి, సీమ కృష్ణ ,పారిశ్రామికవేత్త ఉమ్మి సలీం, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సుజ్ఞానమ్మ, ప్రతాప్, రాజ్ కుమార్, బసవ గంగన్న బద్రి స్వామి పాల్గొన్నారు.

తనపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం

- టైలర్స్ డే వేడుకల్లో ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్

అనవసరం కొందరు తనపై సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఎవ్వరికైనా అన్యాయం జరిగి ఉంటే తన దృష్టికి తీసుకొస్తే న్యాయం చేస్తానని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆదోని టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ తన కుటుంబ సభ్యులు గానీ, తన వారు కానీ అన్యాయం చేసి ఉంటే ఆధారాలతో తన వద్దకు రావాలని కచ్చితంగా న్యాయం చేస్తానని, అనవసరంగా నిందలు వేయడం మానుకోవాలని ఆయన కోరారు. తానే పదిమందికి సహాయం చేస్తానని అలాంటిది అన్యాయం ఎలా చేస్తానని కేవలం కొంతమంది సోషల్ మీడియాను వేదికగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని దాన్ని పట్టించుకోవడం మానేశాను అని గుండె నిబ్బరం చేసుకున్నానని అన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాను వేదికగా చేసుకుని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ప్రధానమంత్రి మోడీని సైతం విమర్శలు చేస్తున్నారని, అలాగే మరి ఎంతోమందిని విమర్శలు చేయడం పరిపాటుగా మారిందని, తాను పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యంగా నిజంగా ఎవరికైనా అన్యాయం జరిగి ఉంటే ఎవరైనా తన వద్దకు పిలుచుకోనిరావచ్చని తాను కచ్చితంగా న్యాయం చేస్తానని అలా చేయని పక్షంలో అప్పుడు మాట్లాడా లని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు చంద్రకాంత్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మహబూబ్బాషా, వైస్ చైర్మన్ కామాక్షి, తిమ్మప్ప, టైలర్ అసోసియేషన్ అధ్యక్షుడు సాబీర్, కార్యవర్గం నజీర్ హుస్సేన్, సాదిక్, రసూల్ బాష, తదితరులు ఉన్నారు.

నిజాయితీ అభ్యర్థులను ఎమ్మెల్సీగా గెలిపించండి

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం : ప్రచారం చేస్తున్న నేతలు

చిప్పగిరి : ప్రచారం చేస్తున్న నాయకులు

నీతి నిజాయితీ గల వారిని ఎమ్మెల్సీలుగా ఎన్నుకోవాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. రామన్న కోరారు. మంగళవారం ప్రజా సంఘాల నాయకులు జయరాజు రంగయ్య, వెంకటేశులు బాబు రామాంజనేయులుతో కలిసి మండలంలోని గ్రామాల్లో పిడిఎఫ్ మద్దతు తెలుపుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిలకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి శాసనమండలికి పంపిద్దామని ఆయన ఓటర్లను కోరారు. మండల పరిధిలోని రచ్చుమర్రి, సుంకేశ్వరి, మాలపల్లి, పరమాన్ దొడ్డితాండలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి సంవత్సరం డిఎస్సీ విడుదల చేస్తామని చెప్పి నేడు మాట తప్పి నిరుద్యోగులను మోసం చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. ఖాళీగా ఉన్న 2,35 లక్షల ఉద్యోగాలు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాడు శాసనమండలి నే రద్దు చేయాలన్నా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మళ్లీ నేడు ఏ మోహం పెట్టుకొని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రం నుంచే శాసనమండలిలో పిడిఎఫ్ కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. నీతి నిజాయితి నిరాడంబరత కలిగిన వారు శాసనమండలికి ఎన్నికై ప్రజల పక్షాన నిలిచారని తెలిపారు. రాష్ట్రంలో రోజు రోజుకు పెరుగుతున్న నిరుద్యోగం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ప్రభుత్వశాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, రాయలసీమ ప్రాంతాల్లో కరువును శాశ్వతంగా దూరం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి పట్టభద్రుల ఆలోచించి నిజాయితీగా ఓటు వేయాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోటీ చేస్తున్న పోతుల నాగరాజును, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కత్తి నరసింహారెడ్డిలని గెలిపించాలని కోరారు.

చిప్పగిరి : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి అయినటువంటి పోతుల నాగరాజును బలపరిచి గెలిపించాలని జిల్లా సిఐటియు అధ్యక్షులు రాధాకృష్ణ, జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి పి హనుమంతు పట్టభద్రులను కోరారు. మంగళవారం మండల కేంద్రమైన చిప్పగిరిలో తాసిల్దార్ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఫాతిమా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పట్టభద్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే వ్యక్తిత్వం ఉన్న వ్యక్తులను ఎన్నుకోవాల న్నారు. నిరుద్యోగ యువత కోసం, ఉద్యోగ ఉపాధ్యాయులు హక్కులు అధికారాలు, ఆత్మ గౌరవం కోసం, సిపిఎస్ రద్దు కోసం కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ చేయడం కోసం, అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు టైం స్కేల్ కోసం, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం నిరంతరం ఈ సమస్యలపై ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి పరిష్కరించే వ్యక్తులు మనకు కావాలన్నారు. మనమందరం కూడా బాగా ఆలోచన చేసి మన అభ్యర్థి అయినటువంటి ఉన్నత విద్యావంతులు పోతుల నాగరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని పట్టభద్రులను, ఉపాధ్యాయులను కోరారు. రైతు సంఘం నాయకులు ఏరూరు రామాంజనేయులు, గోపాలు, నరసప్ప పాల్గొన్నారు.

హోళగుంద : మొదటి ప్రాధాన్యత ఓటుతో పశ్చిమ రాయలసీమ నియోజకవర్గాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోతుల నాగరాజును మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించుకుందామని సిఐటియు నాయకులు వెంకటేష్, నాగరాజు, ప్రజా సంఘాల నాయకులు ప్రచారం నిర్వహించా రు. స్థానిక ఎంపీడీవో తాసిల్దార్, సచివాలయాల దగ్గర ఓటును అభ్యర్థించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ దినోత్సవం

ప్రజాశక్తి - కోసిగి రూరల్

దేవనకొండలో టైలర్స్ డే నిర్వహించిన టైలర్లు

కోసిగి మండల టైలర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ (సిఐటియు అనుబంధ)ఆధ్వర్యంలో టైలర్స్‌డే ఘనంగా నిర్వహించారు. మంగళవారం కోసిగి మార్కండేయ దేవాలయం ఆవరణంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కృష్ణ అధ్యక్షుడు జె నర్సారెడ్డి, యూనియన్ నాయకులు అజయ్ కేక్ కట్ చేసి టైలర్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా యూనియన్ గౌరవాధ్యక్షులు వీరేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేదోడు సాయం కింద ఇచ్చే రూ. 10 వేలను టైలర్ షాప్స్ ఓనర్లకు ఎలాంటి నిబంధనలు లేకుండా ప్రతి టైలర్‌కు ఇవ్వాలన్నారు. టైలర్స్‌కు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వము నిధులు కేటాయించి ఎలాంటి సొసైటీలకు నిమిత్తము లేకుండా టైలర్ వర్కర్స్ 50 సంవత్సరాలుపూర్తి నిండిన వారికి పింఛన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. షాపులకు విద్యుత్ సరఫరా ప్రతినెల 50 పర్సెంట్ సబ్సిడీ ఇవ్వాలని, ప్రభుత్వము సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో గోవిందు, పుట్టి తిక్కయ్య, ఎస్ యు హాన్ ఈరన్న, రామంజి, కోసిగయ్య, తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ : టైలర్లు ఐకమత్యంతో మెలిగి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని మండల టైలర్స్ సంఘం గౌరవ అధ్యక్షులు కరీం, మాజీ సర్పంచ్ భర్త బడి గింజల రంగన్న అన్నారు. దేవనకొండలోని ముగితాత కమ్యూనిటీ భవనములో టైలర్స్ డే మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టైలర్ పని ఎంతో న్యాయబద్ధ నమైందని కష్టపడితే మంచి ఫలితం ఉంటుందన్నారు. బడి గింజల రంగన్న మండల టైలర్స్ సంఘానికి ఒకటిన్నర సెంటు స్థలాన్ని విరాళం ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టైలర్స్ సంఘం వైయస్ సర్పంచ్ ఇబ్రహీం, టైలర్లు పొగాకుల రంగన్న, చింతమాను రంగన్న, రాజా సాహె బ్, వెంకటేష్, బాష, మోదీన్ భాష, తిరుపతి, పలువురు మహిళా టైర్లు పాల్గొన్నారు.

టైలర్స్ డే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న యూనియన్ నాయకులు

శాస్త్రవేత్తల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - గోనెగండ్ల

విద్యార్థులు బాల్యం నుంచే శాస్త్రవేత్తల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి వినోద్ కుమార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పరమేశ్వరరెడ్డి, ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను మంగళవారం గోనెగండ్లలోని ఏపీ మోడల్ పాఠశాలలో ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి ము ఖ్య అతిథులుగా హాజరైన వారు ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులు సివి రామన్ లాంటి శాస్త్రజ్ఞుల పరిశోధనలను స్పూర్తిగా తీసుకొని శాస్త్రీయ అభిరుచి దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రయోగాలు చేసినట్లయితే క్రమశిక్షణ శాస్త్రీయ వైఖరులు అలవడడంతో పాటు తమలోని సృజనకు పదును పెట్టినట్లయి రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్లో గెలుపొం దిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

ఆకట్టుకున్న స్మార్ట్ బ్రిడ్జి ప్రదర్శనలు

పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో రూపొందించిన స్మార్ట్ బ్రిడ్జి ప్రదర్శన ఆకట్టుకుంది. వర్షాలు తుఫానులు వరదలు లాంటివి సంభవించి నప్పుడు బ్రిడ్జి అడుగు భాగంలో ఉన్న సెన్సార్‌కు నీరు తాకగానే బ్రిడ్జి కూలిపోకుండా ఎత్తు పెరిగిపోయి నీరు తగ్గగానే మళ్లీ సాధారణ స్థితికి చేరుకునేలా రూపొందించిన స్మార్ట్ బ్రిడ్జి ప్రథమ బహుమతి పొందింది. అలాగే విద్యార్థులు రూపొందించిన జెసిబి యంత్రం,వ్యర్థ పదార్థాలతో తయారుచేసిన ఎకో బ్రిక్స్,బ్లూటూత్ కారు, ఆటోమేటిక్ డోర్ లాక్ అలారం లాంటి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

భాష్యంలో సైన్స్ ఎక్స్‌పో.. ఆదోని : ఆదోని పట్టణంలో భాష్యం పాఠశాల –2 బ్రాంచిలో సైన్స్ ఎక్స్ పో జరిగింది. డాక్టర్ వెంకట సాయి హాజరై విద్యార్థులు ఏర్పాటు చేసిన నమూనాలను పరిశీలించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ హరి ప్రకాష్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ రకాల ఎక్స్పరిమెంట్స్ చూపరులను ఆకట్టుకున్నాయి. డివిజనల్ ఇంచార్జ్ రవివర్మ, ప్రిన్సిపల్ సదాశివ, వైస్ ప్రిన్సిపల్ అంజి, జెసిఒ సంగీత తల్లిదండ్రులు ఉన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సురేంద్ర బాబు, వైస్ ప్రిన్సిపాల్ భార్గవ్, పవన్, క్యాంపస్ హెడ్మాస్టర్ శిరీష, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఉన్నారు.

పరిమళ విద్యానికేతన్‌లో.. మంత్రాలయం : జాతీయ సైన్స్ డే సందర్భంగా స్థానిక పరిమళ విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన ప్రయోగాలు ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ఏఓ ఈరన్న మాట్లాడారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాలను పరిశీలించి బహుమతులు అందజేశారు. పాఠశాల సిబ్బంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. **జీనియస్ గ్లోబల్ స్కూల్‌లో..** విద్యార్థుల మేధాశక్తి పెరగడానికి సైన్స్ ఫేర్ ఎంతో దోహదం చేస్తుందని శ్రీ మఠం మేనేజర్ యస్కే శ్రీనివాసరావు, సిఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం జాతీయ సైన్స్ డే సందర్భంగా స్థానిక జీనియస్ గ్లోబల్ స్కూల్‌లో విద్యార్థిని విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాల ప్రయోగాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ వైజ్ఞానిక ప్రదర్శనతో బయటకు వస్తుందని తెలిపారు. సివి రామన్ వల్ల మన దేశ కీర్తి పెరిగిందని చెప్పారు. ప్రతి విద్యార్థి సరికొత్త ప్రయోగాలతో మంచి ఉన్నత చదువులతో గుర్తింపు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గంగాధర్ రెడ్డి, ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

చిప్పగిరి : జాతీయ సైన్స్ డే దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రమైన చిప్పగిరి ఫాతిమా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో హెచ్‌ఎం అజిత ఆధ్వర్యంలో సివి రామన్ జయంతి సందర్భంగా నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ పలువురు పిల్లల తల్లిదండ్రుల, సందర్శకులను ఆకట్టుకుంది. సైన్స్ ఎగ్జిబిషన్‌కు పలు పాఠశాలలకు చెందినటువంటి ప్రధానోపాధ్యాయులు పరిశీలకులుగా ఏరూరు హెచ్‌ఎం శ్రీనివాస్ రెడ్డి, కేశవనాథ్, సుధాకర్ వచ్చి విద్యార్థులు తయారుచేసిన అనేకమైనటువంటి పరికరాలు, చిరుధాన్యాల పట్టికలను పరిశీలించారు. పలువురు విద్యార్థులను అభినందించారు. ఫాతిమా పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. **ఆలూరు:** ఆలూరులో గ్రంథాలయం,పాఠశాల,కళాశాలలో మంగళవారం విద్యార్థులు సైన్స్ డే సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఆలూరు గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ డే సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ట్యాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అంతకుముందు సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాలర్పించారు. ఈకార్యక్రమ ంలో సైన్స్ ఉపాధ్యాయులు అశ్విన్ కుమార్, రిటైర్డు హైస్కూలు ప్రధానోపాధ్యాయులు వీరాస్వామి, దేవదానం, రిటైర్డు హాస్టల్ వార్డెన్ అనంత స్వామి పాల్గొన్నారు. **హాలహార్వి :** మండలంలోని కస్తూర్బా, జెడ్‌పీహెచ్‌ఎస్ హైస్కూలులో ఎస్ఓ పద్మావతి, హైస్కూల్ హెచ్‌ఎం వెంకటరమణ సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పూర్వపు విద్యార్థి, డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడారు. నేటి బాలలే రేపటి పౌరులు అంటారుగాని రేపటి సైంటిస్టులు కూడా కావాలని ఆకాంక్షించారు. అనంతరం నమూనాలు తయారు చేసిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఎంఈఓ ఈరన్న, మారుతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయంలో.. ఎమ్మిగనూరు రూరల్ : నవోదయ విద్యాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ కె. సాగరిక మాట్లాడుతూ మిమ్స్ ప్రదర్శన ద్వారా సేవ్ వాటర్ సేవ్ వరల్డ్ అనే మెసేజ్‌ను తెలియజేసారు. కార్యక్రమంలో సీనియర్ టీచర్ బసవరాజ్, పద్మజ నాన్సీ, హరీష్ కుమార్,రింకు శర్మ, వెంకటయ్య, శ్రీనివాస రావు, శివాజీ రావు,మీనా చంద్రన్, హేమ లత,సునీల్, వెంకటేష్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నవోదయ విద్యాలయంలో..

సివిల్ సప్లయ్ గోడౌన్‌లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి-ఆలూరు

స్థానిక సివిల్ సప్లై గోడౌన్‌లో విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ తహసీల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ రికార్డులలో కన్న 4 క్వింటాలు రేషన్ బియ్యం తక్కువగా ఉన్నాయన్నారు. ఆలూరు సిఎస్ డిటి శ్రీదేవిపై,తనిఖీలో ఉన్న రేషన్ వ్యత్యాసాని జిల్లా సివిల్ సప్లై అధికారులకు నివేదిక అందిస్తామన్నారు. తదుపరి చర్యలు వారు తీసుకుంటారన్నారు. తనిఖీలలో విజిలెన్స్ అధికారు లు ఎస్ఐ జి.నగేష్, హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - కోసిగి రూరల్

పదోతరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఇఒ మొయినుద్దీన్ అన్నారు. మంగళవారం నాడు మండల పరిధిలోని పల్లెపాడు ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పల్లెపాడు పాఠశాలలను ఎంఇఒ సందర్శించారు. పాఠశాల ప్రార్థన సమయానికి హాజరై పాఠశాల నిర్వాహణా తీరును గమనించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి, సకాలంలో సిలబస్ పూర్తి చేయడానికి కృషి చేయాలని సూచనలు చేశారు. పదవతరగతి విద్యార్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పరీక్షలకు ఎలా సిద్దపడాలి, వందశాతం ఉత్తీర్ణత సాధించెందుకు ప్రతి విద్యార్థి ప్రణాళిక బద్దంగా చదవాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చే అన్ని అవకాశాలను ఉపయోగించుకొని ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు సుధాకర్ బాబు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మీనాక్షి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు ట్యాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి - హోళగుంద

పదవ తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం ప్రతిభా పరీక్షను హోళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం మల్లికార్జున, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఎస్ఓ పర్వీన్ చేతుల మీదుగా పేపర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ విద్యార్థులకు వచ్చే నెలలో 10వ తరగతి పరీక్షలకు భయాందోళనకు గురికాకుండా ముందుగానే ఈ విధంగా ప్రతిభ పరీక్ష రాయడం ద్వారా విద్యార్థులకు ఉన్న భయాలను పోగొట్టి ముందుగానే వారి పరీక్షలకు ఉపయోగపడుతుందని అన్నారు. ఇప్పుడు జరుగుతున్న ప్రజ్ఞా వికాస పరీక్ష గురించి, భవిష్యత్తులో జరిగే ఇతర పరీక్షల గురించి సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ పరీక్షలను మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లికార్జున సీఐటీయూ నాయకులు వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, ADONI
O.S. 286/2022

Between:-
1.Prahalladha. ….plaintiff
Versus
1. N.Bhoja Rajendra Prasad. …Defendant
To,
N.Bhoja Rajendra Prasad S/o N. Gokul Prasad, aged 54 years, Hindu H.No.02/534, Seetharam Nagar, Adoni. …Respondents
Sir,
Whereas the above named plaintiff has filed suit for recovery of amount. The above matter has posted to 02.03.2023. As such you are hereby summoned to appear before this Hon'ble court either in person or through pleader to answer all material questions relating to the above suit in the event of failure to appear before the Hon'ble Court on 02.03.2023 @ 10 : 00 AM you will be treated Ex – Parte and further directed to fill statement and to produced all documents on which relive.

HAJI.A.RAZA AHMED
Advocate for Petitioner.

మహారాజశ్రీ కర్నూలు జిల్లా ఫ్యామిలీ జడ్జి కోర్టులో
F.C. M.C. NO.10/2022
శ్రీమతి బి.కళ్యాణి. …అర్జీదారులు
(ఎదురి)
బి.రంజిత్ రెడ్డి తండ్రి బి.గోపాల్ రెడ్డి, సాఫ్టవేర్ ఇంజనీర్, ఇంటి.నెంబర్.78/129–బి –1, కృష్ణానగర్, కర్నూలు. …రెస్పాండెంట్
రెస్పాండెంట్ కు సెక్షన్ 125 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ మరియు సెక్షన్ 7 ఫ్యామిలీ కోర్టు యాక్ట్ ప్రకారము నోటీసులు
పై నెంబర్ ఎఫ్. సి. ఎం. సి. లో అర్జీ దారులు భరణము నెలకు రూ. 50,000/– రెస్పాండెంట్ తో ఇప్పించమని మరియు ఈ ఎఫ్. సి. ఎం. సి. ఖర్చులు కూడా ఇప్పించమని కోరుతూ అర్జీ దాఖలు చేసినది. ఇందులో రెస్పాండెంట్ అయిన నీకు ఆక్షేపణ ఉన్న 15–3–2023వ తేదీన ఉదయం 10.30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
"కోర్టు వారి ఉత్తర్వుల మేరకు"
బి.రాజేష్ కుమార్,
అర్జీదారులు పరం అడ్వకేట్,
కర్నూలు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : DHONE
IA NO. 287/2022 O.S No. 411/2011
జి.రాధ D/o రామానాయుడు
R/o ఇ.నెం. 69/606–ఎ4, ముత్యాలమ్మ వీధి, జోహరాపురం గ్రామం, కర్నూలు జిల్లా.
…వాది
-Vs-
గోసు రామలక్ష్మమ్మ మరియు ఇతరులు. …ప్రతివాదులు
వాదికి నోటీసు
పై దావా నందు ప్రతివాదులు పునఃర్వ బారణ కోరి అర్జీదాఖలు చేసివున్నారు. కోర్టు నుండి పలు మార్లు నోటీసులు పంపిన మీరు తీసుకొనందున ఈ పత్రికా ముఖముగా తెలియ పరుచుట ఏమనగా మీ హాజరు కోరి 24–03–2023న వాయిదా వేసి యున్నారు. కావున మీరు కాని మీ వకీలు గారు గాని పై తేదిన పై కోర్టు ముందు హాజరయి మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెల్పుకొనగలరు. లేని పక్షంలో మీ పరోక్షమున తీర్మాణంచగలరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది : 24-03-2023
B.BHASKAR,
ప్రతివాదుల వకీలు,
డోన్, నంద్యాల జిల్లా.
సెల్ : 9440208679

వైసిపి నాయకుడిపై కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూర్ పట్టణంలోని బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నగర్‌లో గుడిసె వాసులపై దౌర్జన్యం చేసి కులం పేరుతో దూషించిన వైసిపి కౌన్సిలర్ భర్త బ్రహ్మయ్య ఆచారి, పూసల జయమ్మపై కేసు నమోదు చేయాలని మంగళవారం గుడిసె వాసులు సిఐ విజయభాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా నాయకురాలు గంధం హుస్నమ్మ, మహిళా సంఘం నాయకులు సోడా బిబి మాట్లాడుతూ 2009 నుండి సిపిఎం ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉన్నారని, నేడు కొత్తగా ఎన్నికైన వైసిపి కౌన్సిలర్ భర్త బ్రహ్మయ్య ఆచారి, పూసల జయమ్మ గుడిసె వాసులను ప్రతిరోజు బెదిరించి భయభ్రాంతులకు గురి చేయడం అన్యాయమన్నారు. పట్టాలు కావాలంటే రూ. 20 వేలు ఇవ్వాలని, లేకుంటే ఇక్కడి నుండి వెళ్లగొడతామని బెదిరించారని, వారిపై కేసు నమోదు చేసి గుడిసె వాసులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నూర్జహాన్, నాగ లచ్చుమ్మ, పూర్ణమ్మ, ఎస్టి నాగమ్మ, ఎస్టి వెంకటమ్మ , దళితులు ఏసన్న, నరసింహులు, నాగన్న ,అబ్రహం, స్వాములు, వ్యకాస మండల ఉపాధ్యక్షులు వేణుగోపాల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని యాగంటిపల్లె సాయిబాబా గుడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గోర్లగుట్ట గ్రామానికి చెందిన మిడుతూరు తిరుపతయ్య(48) మృతి చెందినట్లు ఎస్సై రామిరెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ రాత్రి 10 గంటలకు బేతంచెర్ల మండలం గొర్లగుట్ట గ్రామానికి చెందిన మిడుతూరు తిరుపతయ్య యాగంటి పల్లె గ్రామానికి చెందిన వారి దూరపు బంధువైన వెంకటస్వామి దినం కార్యక్రమంకు వచ్చి తిరిగి స్కూటర్‌పై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. తిరుపతయ్య కుమారుడు శివశంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేటి నుంచి గాలికుంటు టీకాలు

ప్రజాశక్తి - చాగలమర్రి

గ్రామాల్లో పశువులకు గాలి కుంటు వ్యాధి సోకకుండా నేటి నుంచి గాలి కుంటు టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వరప్రసాద్ తెలిపారు. చాగలమర్రి పశువైద్యశాలలో మంగళవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని వివరించారు. మండలంలోని 2451 తెల్ల పశువులకు, 9423పాడిగేదెలకు, దూడలకు ఈ టీకాలు వేస్తామనానరు. పశువైద్యాధికారి సాయిబాబా పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** కొలిమిగుండ్ల మండల పరిధిలోని వివిధ గ్రామాలలో బుధవారం నుంచి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు పశు వైద్య అధికారిని డాక్టర్ పద్మావతి తెలిపారు. మండలంలోనిపశువుల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కెవి.సుబ్బారెడ్డి సైన్సు దినోత్సవం వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

డాక్టర్ కె. వి. సుబ్బారెడ్డి ఫార్మసీ కాలేజీ లో జాతీయ సైన్సు దినోత్సవం వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా.కె.వి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ మానవళి అభివద్ధి లో సైన్సు పాత్ర గురించి వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ బి.వి.రమణ మాట్లాడుతూ భారతీయ శాస్త్ర వేత్తల సేవలను వివరించారు. విద్యార్థులు తమ స్కిట్లతో, డ్యాన్స్ తో అలరించారు.

భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిని గెలిపించడి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

టిడిపి మద్దతుతో పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న భీమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి పట్టభద్రులను కోరారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మాజీ ఎమ్మెల్యే కరపత్రాలను పంపిణీ చేసి, ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాటం చేసే భీమి రెడ్డి రాంగోపాల్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు రాయలసీమ సలాం, నాయకులు కలాం, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు. **ఉయ్యాలవాడ :** పశ్చిమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి గెలుపు ఖాయమని మండల టిడిపి కన్వీనర్ కూడా నారాయణరెడ్డి తెలిపారు. అభ్యర్థి భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండలంలోని తుడుములదిన్నె గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షుడు బోరెడ్డి శేఖర్ రెడ్డి, మండల నాయకులు పేరెడ్డి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **మహానంది :** మండలంలోని మసీదుపురం గ్రామంలో టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మండల నాయకులు నరాల చంద్రమౌలి రెడ్డి, పార్టీ శ్రేణులు ఓటర్లను మంగళవారం కోరారు. మండలంలోని బుక్కాపురం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

ఉయ్యాలవాడ : ప్రచారం చేస్తున్న నాయకులు

పెళ్లి కానుక కిట్టు అందజేత

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలంలోని పెట్నికోట గ్రామానికి చెందిన నాగ సుబ్బయ్య, సరోజ దంపతుల కుమార్తె వివాహం సందర్భంగా వారికి పెళ్లి కానుక కిట్టును బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కోయిలకుంట్ల మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్, తెలుగు యువత మండల అధ్యక్షుడు గొంగటి హుసేన్ రెడ్డి, నాగ సుబ్బయ్య, సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గని కార్మికుడు మృతి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

విద్యుత్ షాక్‌తో గని కార్మికుడు బెలుం గ్రామానికి చెందిన బందెల కంబయ్య (33) మృతి చెందినట్లు ఎస్ఐ రమేష్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. కొలిమిగుండ్ల మండలం బెలుం గ్రామానికి చెందిన బందెల కంబయ్య బెలుం గ్రామం సమీపంలో శంకర్‌కి చెందిన నాపరాయి గనిలో పని చేస్తూ జీవనం కొనసాగించే వాడు. ఉదయం బందెల కంబయ్య గనిలో నాపరాయి కోత మిషన్‌తో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురవగా తోటి కార్మికులు ఆసుపత్రికి తరలించే క్రమంలో మరణించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేయాలి

- పొలం రస్తాల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపండి
- జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీలు అంగన్‌వాడీ పాఠశాలలకు వెళ్లి పిల్లలకు పోషిక ఆహారం అందుతుందో లేదో తనిఖీ చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. మంగళవారం కొలిమిగుండ్లలోని ఎంపీడీవో కార్యాలయం నందు మండల అధ్యక్షురాలు నాగవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎంపీడీవో సుబ్బరాజు హాజరయ్యారు. ముందుగా అంకిరెడ్డి పల్లె ఉప సర్పంచ్ కె.పి లక్ష్మీకాంత రెడ్డి(బాబు) ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నిబంధనలు మేరకే సర్వసభ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి రిపోర్టును చదివి వినిపించారు. మీర్జాపురం సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మీర్జాపురం గ్రామంలో రెండు స్కూళ్లలో ఇద్దరు టీచర్లకు ప్రమోషన్లు రావడం వల్ల ఇతర ప్రాంతాలకు వెళ్లారని, వారి స్థానంలో ఒక టీచర్‌ని కేటాయించాలన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీవాణి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు పోషిక ఆహారం తీసుకునేందుకు రావడంలేదని, వారిని ప్రజా ప్రతినిధులు ప్రోత్సహించా లన్నారు. తోలమడుగు పంచాయతీ పరిధిలో నిరుపయోగంగా ఉన్న రెండు బోర్లను మరమ్మతులు చేయాలని సర్పంచ్ మొలక రాజారెడ్డి కోరారు. నందిపాడు సర్పంచ్ గురివిరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఉపయోగపడే పనులు చేయించాలన్నారు. మండల ఉపాధ్యక్షులు ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ చెరువులు పంట కాలువలు ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి చేయాలన్నారు. అబ్దుల్లాపురం సర్పంచ్ ఎస్.వి నారాయణరెడ్డి మాట్లాడుతూ గతంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం డబ్బులు ఖర్చు దాదాపు లక్షలాది రూపాయల ఖర్చు చేసినప్పటికీ ఇంతవరకు బిల్లులు రాలేదనిఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారం కోసం సర్పంచ్ల ఖాతాలో డబ్బులు లేవని, కనుక మండల పరిషత్, జిల్లా పరిషత్ ద్వారా గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించేలా కృషి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్‌ను కోరారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభమైనందున ఏ గ్రామంలో కూడా తాగు నీటి సమస్య ఉత్పన్నం కాకూడదని, ప్రజాప్రతినిధుల సహకారంతో సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు మహేశ్వర్ రెడ్డి, మొలక రాజారెడ్డి, గురివిరెడ్డి, ఎం సుంకమ్మ, రాముడు, కొండయ్య, ఈశ్వరయ్య, మండల ఉపాధ్యక్షుడు ఎస్వి కృష్ణారెడ్డి, ఎంపిటిసి తలారి రమణ, వివిధ ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

మెడికవర్‌లో నర్సింగ్ ఎక్సలెన్స్ ట్రైనింగ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మెడికవర్ హాస్పటల్స్, కర్నూలు వారి ఆధ్వర్యంలో 'నర్సింగ్ ఎక్సెలెన్స్ ట్రైనింగ్ ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడకవర్ హాస్పిటల్స్ నర్సింగ్ సిబ్బంది తో పాటు, వివిధ నర్సింగ్ కాలేజీ విద్యార్థులు దాదాపు 150 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుదర్శన్ రెడ్డి, డాక్టర్ టి వి. సునీల్ యాదవ్డా క్టర్ మురార్జి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వై .మహేశ్వరరెడ్డి , సెంటర్ హెడ్‌పి. నీలా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఇన్ఫెక్షన్ కంట్రోల్ యొక్క ప్రద్యనాథ గురించి పాల్గొన్న సిబ్బంద్ది, విద్యార్థులకు వివరించారు. డాక్టర్ టి.వి సునీల్ యాదవ్ మాట్లాడుతూ నర్సింగ్ ఎక్సెలెన్స్ ఇన్ ఎమర్జెన్సి పేషెంట్ మేనేజ్ మెంట్ ప్రాముఖ్యత గురించి వివరించారు. డాక్టర్ మురార్జి మాట్లాడుతూ చిన్న పిల్లలను ఎమర్జెన్సీ సమయంలో ఎలా కాపాడాలో తెలియజేశారు. వైస్ ప్రసిడెంట్ డాక్టర్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కారిక్రమం లో పాలుగొన్న గీతాంజలి నర్సింగ్ కాలేజీ విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజెస్తూ,ఇలాంటి కార్యక్రమాలని ప్రోత్సహించడానికి మెడికవర్ హాస్పిటల్స్ ఎల్లప్పుడూ ముందుంటుంది అని తెలపారు..

సంస్కరణల ముసుగులో ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగు : ఎస్‌టియు

ప్యాపిలి : సంస్కరణల ముసుగులో ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఎస్టీయు నంద్యాల జిల్లా అధ్యక్షుడు అజామ్ బేగ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఒకటవ తరగతికి అడ్మిషన్లు కల్పించి అమ్మఒడితో వారి ఫీజులను ప్రభుత్వం చెల్లిస్తే ఇక ఒకటవ తరగతిలో ప్రభుత్వ పాఠశాలలో చేరే వారు ఎక్కడ ఉంటారని ప్రశ్నించారు. ఎనిమిది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తామన్నారు. మొత్తానికి ఉపాధ్యాయుల కొరత సృష్టించి, విద్యార్థులు లేరనే సాకుచూపి ప్రభుత్వం ఉచిత విద్య నుంచి తప్పుకుని చేతులు దులుపుకోవడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ నాయక్, జిల్లా సిపిఎస్ కన్వీనర్ చిన్నపరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం

బనగానపల్లె : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జెకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జేఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పలుకూరు గ్రామంలో మెయిన్ ప్రాథమిక పాఠశాలలో జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఎస్ఎస్ బ్రహ్మానంద చారి ఆధ్వర్యంలో హిందూపూర్ పట్టణానికి చెందిన మదర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అశోక్ కుమార్ సహకారంతో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సురేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి ధర పతనం అవుతున్నా ప్రభుత్వానికి పట్టదా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆదోని మార్కెట్ యార్డులో పత్తి ధర పూర్తిగా పతనం అవుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత వారం రోజులలో దాదాపుగా రూ.1000 వరకు పత్తి ధర తగ్గింది. కనిష్ట ధర రూ.5600, గరిష్టదర రూ. 7800 ఉంది. క్వింటాలుకు రూ.10 వేల వరకు ఉన్న ధర పూర్తిగా తగ్గిపోయింది. రైతులు తక్కువ ధరకు అమ్మి సాగు ఖర్చులు కూడా రాక ఇంటికి పోతున్నారు. ఇళ్లల్లో నిల్వ ఉంచడానికి స్థలం సరిపోదు,ఆర్థిక కష్టాలు, అవసరాల రీత్యా పండిన పంటను వ్యాపారులకు అమ్మి పోతున్నారు. వ్యాపారాలు సిండికేట్ గా ఏర్పడి ధరను తగ్గించినా జిల్లా అధికారులు స్పందించడం లేదన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ను సందర్శించి పత్తి ధర పతనం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాపారులు సిండికేట్ గా ఏర్పడకుండా చూడాలన్నారు. క్వింటాల్ కు కనీసం రూ.10 వేలు ధర ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

హాకీ విజేతలు గార్గేయ పురం

ప్రజాశక్త-కర్నూలు స్పోర్ట్స్

దా సరి సు ఒష్ మెమో రియల్ హాకీ పోటీలో ఎస్టీ బీసీ కళాశాల కర్నూలులో బాలుర విభాగంలో విజేతలుగా గార్గేయపురం జట్టు మునగాలపాడు జట్టుపై రెండు ఒకటి 2-1తేడాతో విజయం సాధించింది. బాలికల విజేత గార్గేయపురం జట్టు, మునగాల పాడు 3- 0 తో గెలుపొంది విజేతలయ్యారు. బహుమతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాకీ సంఘం ఉపాధ్యక్షులు డి. మేరీ జాస్మిన్ విజేతలకు మెడల్ ట్రోఫీలను అందజేశారు, బి గౌడ్ మొదలగు వారు పాల్గొన్నారు.

అనారోగ్యంతో పంచాయతీ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి -కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలో పంచాయతీ జూనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న గురువాంజన్న మంగళవారం అనారోగ్యంతో మతి చెందారు. అంజన్న (55) 25 ఏళ్లుగా పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్గా విధులు నిర్వర్తిస్తున్నారు. నాలుగు నెలల క్రితం నుంచి అనారోగ్యం వారిని పడి ఇటీవల జిల్లా ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి అంకాలప్పతో పాటు సిబ్బంది, సర్పంచి శ్రీనివాసులు ఎంపిటిసి గోపాల్, సిపిఎం నాయకులు, ఆంజనేయులు, గోపాల్ మృతుని కుటుంబాన్ని వేర్వేరుగా పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

టైలర్లు ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి-పత్తికొండ: టైలర్లు ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలని టైలర్లందరూ ఐకమత్యంతో ముందుకు వెళ్లాలని టైలర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి.వెంకటేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పత్తికొండ పట్టణంలో టైలర్ల దినోత్సవం సందర్భంగా ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుంచి నాలుగు స్తంభాల కూడలి దగ్గర కు టైలర్లు ర్యాలీగా వచ్చి గాంధీ జీ, పొట్టి శ్రీరాములు విగ్రహానికి రాష్ట్ర అధ్యక్షులు వి వెంకటేశ్వర రెడ్డి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం టైలర్ల కార్యాలయంలో టైలర్ వ్యవస్థాపకుడు సృష్టికర్త థామస్ సేయింట్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టైలర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి.వెంకటేశ్వర రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చుకప్ప మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి టైలర్ పెద్దపీట వేశారని అన్నారు. తుగ్గలి మండలం పగడరాయిగ్రామానికి చెందిన టైలర్ తలారి శ్రీనివాసులు షాపు అగ్ని ప్రమాదంతో కాలిపోయింది. తలారి శ్రీనివాసులకు సొంత డబ్బులతో కుట్టు మిషన్ అందజేశారు. లాటరీ పద్ధతిలో టైలర్లకు కూలరు టేబుల్ ఫ్యాన్ సీలింగ్ ఫ్యాన్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తాలూకా అధ్యక్షులు రంగన్న మహమ్మద్ బాష, ఇస్మాయిల్ బాష రాజు శిక్షావల్లి మహారాజ్ టైలర్ నరసింహులు సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండలో టైలర్స్ ప్రదర్శన

జాతీయ వెటరన్ అథెటిక్స్‌లో జిల్లాకు పతకాలు

పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న టిజి.వెంకటేష్

ప్రజాశక్తి-కర్నూల్ స్పోర్ట్స్ : ఇటీవలి కలకత్తాలో జరిగిన జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో కర్నూలు జిల్లాకు పలు పతకాలు లభించాయి. జిల్లాకు చెందిన క్రీడాకారిణి సీమా ఎలిగే 5 కిలోమీటర్ల నడకలో మూడో స్థానం , ఖాజా బందే నవాజ్ 55 ప్లస్ ఏజ్ గ్రూపులో 400 మీటర్ల హర్డిల్స్ లో రెండవ స్థానం ,400 మీటర్స్ రిలే లో రెండవ స్థానం, 100 మీటర్స్ మూడవ స్థానం , చెన్నకేశవరెడ్డి 55 ప్లస్ లో 400 మీటర్స్ హర్డిల్స్ లో వెండి పతకం, 400 మీటర్స్ రిలేలో వెండి పతకం, 100 మీటర్స్ రిలే లో 3 స్థానం, పాండురంగారెడ్డి 70 ప్లస్ ఏ గ్రూపులో జావెలిన్‌త్రోలో 3వ స్థానం , శంకర్ రెడ్డి 85 ప్లస్ లో డిస్కస్‌త్రోలో జావలిన్‌త్రోలు వెండి పతకాలు కైవసం చేసుకున్నారు. వీరు అక్టోబర్ నెలలో ఫిలిప్పీన్స్ లో జరుగు ఎషియన్ మీట్ నందు సెలెక్టుఅయిన సందర్భంగా వారికి మాజీ రాజ్యసభ సభ్యులు టిజి. వెంకటేష్ పాతకాలు సాధించిన జిల్లా క్రీడాకారుల కు శాలువా మెమొంటోలతో సత్కరించారు. ఏషియన్ మీటిలో పాల్గొనే వారికి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అలాగే స్పోర్ట్స్ నందు ఎటువంటి వారికి అయినా టిజివి గ్రూప్ సంస్థలు సహాయక సహకారాలు ఉంటాయని రాజ్యసభ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రామచంద్ర రెడ్డి (మునగాల సర్పంచ్) మద్దిలేటి రెడ్డి ట్రెజరర్ నరసయ్య ,రామచంద్ర రెడ్డి , ఆదోని సెక్రెటరీ బద్రీనాథ్ జిల్లా ప్రెసిడెంట్ పాండు రంగా రెడ్డి , జిల్లా సెక్రెటరీ రవికుమార్ లు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

కోడుమూరులో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-కోడుమూరు

పిడిఎఫ్ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిలను గెలిపించాలని. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.లక్ష్మన్న దళం చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాజు దళం సిఐటియు మండల కార్యదర్శి జి పి వీరన్న దళం, ప్రజా సంఘాల నాయకుడు టి వీరన్న దళం. నాలుగు దళాలు కొండపేట బిసికాలనీ. సుందరయ్య నగర్ మోమిన్ వీధుల.లో ప్రచారం నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు ఇళ్లిల్లు తిరుగుతూ నిత్యం ప్రజా సమస్యలపై పోరాటం చేసే నాయకులు కత్తి నర్సింహారెడ్డి పోతుల నాగరాజు ను గెలిపించుకుంటే భవిష్యత్తులో బాగుంటుందని వారన్నారు. శాసనమండలిలో మేధావులు ప్రజల పక్షాన మాట్లాడేవారు ఉంటే ప్రజా సమస్యలపై చర్చ జరుగుతుందని, అలాంటి వారిని మీరు ఓటర్లందరూ పెద్దమనసుతో ఆలోచించి ఆశీర్వదించి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గఫూర్ మియ్యా, రాముడు, బి శేఖర్. రాజు, అర్జున్, నాగరాజు, మధు, బుడ్డప్ప, శివ గిడ్డయ్య, మునుస్వామి, శంకర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు

రాష్ట్ర అథ్లెటిక్స్ లో జిల్లాకు పతకాలు

ప్రజాశక్తి-కర్నూల్ స్పోర్ట్స్

యూత్ ఛాంపియన్ రాష్ట్రస్థాయి పోటీల్లో వెస్ట్ గోదావరి జిల్లాలోని ఏలూరులో జరిగయి ఈ పోటీలలో కర్నూలు జిల్లా క్రీడాకారులు పాల్గొని పథకాలు సాధించరూ కర్నూలు జిల్లా అథ్లెటిక్స్ సెక్రెటరీ సి హర్షవర్ధన్ అథ్లెట్ లను అభినందించారు. గెలుపొందిన విద్యార్థులు ఎస్ షేక్షావలి 800 , 1500 మీటర్స్ ప్రథమ స్థానం సాధించారు. కె మంజునాథ్ లాంగ్ జంప్‌లో తతీయ స్థానం సాధించారు. కె. జస్వంత్ షాట్ పుట్ లో తతీయ స్థానం సాధించారు. అదేవిధంగా జాయింట్ సెక్రటరీ లక్ష్మయ్య అభినందించారు. జాతీయ స్థాయిలో కూడా పాల్గొని మంచి ప్రతిభ కనబరచాలని కార్యదర్శి హర్షవర్ధన్ తెలిపారు.

శ్రీచైతన్యలో ఘనంగా సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు జిల్లాపరిషత్

స్థానిక బుధవారపేట లోని శ్రీచైతన్య పాఠశాల లో సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయని పాఠశాల ప్రిన్సిపాల్ మౌనిక తెలిపారు. మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ దినోత్సవ కార్యక్రమానికి శ్రీచైతన్య విద్యాసంస్థల ఎజిఎం సురేష్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ కెవి. మధుసూదన్, శ్రీ చైతన్య పాఠశాలల ప్రాంతీయ బాధ్యులు వి.వెంకటేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎజిఎం సురేష్ విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ ఈ సైన్స్ ఎక్స్‌పో విద్యార్థుల్లో దాగివున్న సజనాత్మకతను వెలికి తీసేందుకు ఎంతో దోహదపడుతుందని చెప్పారు. ప్రాంతీయ బాధ్యులు వెంకటేష్ మాట్లాడుతూ సైన్స్ ఎక్స్‌పో విద్యార్థులకు విజ్ఞాన శాస్త్ర రంగంలో సాంకేతిక ప్రగతికి ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ కెవి.మధుసూదన్ నాగలి నుండి హరిత విప్లవమ్ దాకా, నిప్పు నుండి అణుబాంబు దాకా శాస్త్ర సాంకేతిక పురోభివద్ధి గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు తాము రూపొందించిన అనేక ప్రయోగాలు ప్రదర్శించి వాటి గురించి చక్కగా వివరించారు ,ఈ ప్రయోగాలు అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులచే రూపొందించిన ప్రయోగాలలో కొన్నిటికీ బహుమతులు బహు కరించారు. డీన్ వీరయ్య ఆచారి, ప్రైమరీ ఇంచార్జి రమ్య, సైన్స్ ఉపాధ్యాయులు సాజిదాబేగం, ఇంద్రసేనా రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రశ్నించే గొంతుకలనే గెలిపించండి

- ప్రజా సంఘాల నాయకులు
- పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా విస్తృత ప్రచారం

నందికొట్కూరు ఎబిఎం పాలెంలో పోతుల నాగరాజుకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - నందికొట్కూరు

ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకలు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డి లను ఎమ్మెల్సీలుగా గెలిపించాలని అభ్యర్థిస్తూ ప్రజా సంఘాల నాయకులు మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. నందికొట్కూరు మున్సిపాలిటీలోని ఎబిఎం పాలెంలో పోతుల నాగరాజుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరావు, రైతు సంఘం జిల్లా నాయకులు పి వెంకటేశ్వర్లు, సిఐటియు టౌన్ కార్యదర్శి గోపాలకృష్ణలు మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజును గెలిపించాలని కోరారు. పోతుల నాగరాజు బడుగు బలహీన వర్గాల ప్రయోజనాల కోసం పని చేస్తున్న వ్యక్తి అన్నారు. ఇటువంటి వ్యక్తి గెలవడం వల్ల శాసనమండలిలో ప్రజల తరపున మాట్లాడడానికి అవకాశం ఉంటుందని, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సుధాకర్, సుంకన్న, జాన్, శేఖర్, సురేష్, ప్రజాశక్తి విలేఖరి స్వామన్న తదితరులు పాల్గొన్నారు. **ప్యాపిలి :** ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకలు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలను ఎమ్మెల్సీలుగా గెలిపించాలని అభ్యర్థిస్తూ మంగళవారం నక్కలవాగుపల్లి, చిన్నపూజళ్ళ, పెద్ద పూజళ్ళ, ఓబులదేవరపల్లి, మాన్ దొడ్డి, గడిపాడు, పిఆర్ పల్లె గ్రామాలలో ప్రజా నాట్యమండలి, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ సంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా నాట్య మండలి జిల్లా కన్వీనర్ కోయిల కొండ నాగరాజు, నక్కిశ్రీకాంత్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మధు శేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు విజయ్‌లు మాట్లాడారు. ఈ నెల 13న జరిగే శాసన మండలి పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు జరిగే ఎన్నికలలో పిడిఎఫ్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న గ్రాడ్యుయేట్ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు, టీచర్ ఎమ్మెల్సీ (మిగతా 6లో..)

పారిశుధ్య నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి

- తాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా ముందస్తు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలోని పట్టణ, గ్రామీణ అన్ని ప్రాంతాలలో ఎక్కడ చూసినా పారిశుధ్య లోపం స్పష్టంగా కనిపిస్తోందని ఈవోఆర్డీలు, పంచాయతీ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పారిశుధ్యాన్ని తొలగించి పరిశుభ్రంగా ఉంచేందుకు దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాలులో తాగునీటి సరఫరా, పబ్లిక్ హెల్త్, పారిశుధ్య నివారణ చర్యలు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వీధుల్లో పందులు, కుక్కల బెడద నివారణకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించి ఆ మేరకు చర్యలు తీసుకోవాలని పంచాయితీ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లోని తాగునీటి సరఫరాకు ప్రధాన వనరులైన నంద్యాల పట్టణానికి కెసి కెనాల్, వెలుగోడు రిజర్వాయర్, డోన్ పురపాలక సంఘానికి గాజులదిన్నె ప్రాజెక్ట్, నందికొట్కూరు మున్సిపాలిటీకి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, ఆళ్లగడ్డ నగర పంచాయతీకి గండలేరు రిజర్వాయర్, ఆత్మకూరు మున్సిపాలిటీకి వెలుగోడు రిజర్వాయర్, బేతంచర్ల నగర పంచాయతీకి గ్రౌండ్ వాటర్ (పవర్ బోర్ వెల్స్)కు సంబంధించి పైపులైను లీకేజీలు మరమ్మతులు ఏవైనా ఉంటే యుద్ధప్రాతిపదికన చేపట్టి వచ్చే వేసవిలో నీటికి ఇబ్బంది లేకుండా చూడాలని పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లను ఆదేశించారు. అన్ని గ్రామాల్లో హ్యాండ్ వాష్ (చేతుల పరిశుభ్రతపై) అవగాహన కల్పించేందుకు స్పెషల్ క్యాంపైన్ నిర్వహించాలని డిఎంహెచ్ఓకు సూచించారు. దోమల బెడద నివారణకు ఫాగింగ్, యాంటీ లార్వా నివారణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పండుగలు, జాతరలో ఆహార పదార్థాలు కల్తీ మయం కాకుండా అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ మనోహర్, డిపిఓ శ్రీనివాసులు, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ గంగాధర్, డిఎంఅండ్ హెచ్ఓ వెంకటరమణ, భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రఘురాం తదితరులు పాల్గొన్నారు.

గరుడ విమానంలో జ్వాలా నరసింహుడు

- హంస వాహనంపై ప్రహ్లాద వరదుడు

హనుమంత వాహనంపై జ్వాలా నరసింహుడు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన ఎగువ అహోబిలంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా 4వ రోజు మంగళవారం యోగా నృసింహ గరుడ విమానంపై జ్వాలా నరసింహ స్వామి విహరించారు. అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీవన్ శ్రీ శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో మఠం ప్రతినిధి సంపత్, మేనేజర్ శ్రీనివాసన్ సమక్షంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవమూర్తి జ్వాల నరసింహ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసిన అనంతరం మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం జ్వాల నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు అర్చకులు లక్ష్మీనరసింహాచార్యులు వేదమంత్రాల నడుమ అభిషేకం నిర్వహించారు. రాత్రి జ్వాల నరసింహస్వామిని హనుమంత వాహనంపై అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

దిగువ అహోబిలంలో : దిగువ అహోబిలంలో ఉదయం శ్రీ ప్రహ్లాద వరద స్వామి హంస వాహనంపై కొలువు దీరి భక్తులకు దర్శనమిచ్చారు. అహోబిల మఠం పీఠాధిపతి శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ సమక్షంలో ప్రధాన అర్చకులు వేణుగోపాలచార్యులు, అర్చక బృందం ఉత్సవమూర్తులు ప్రహ్లాద వరద స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం అహోబిలం మాడవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో అహోబిలం మఠం చేరుకున్న ప్రహ్లాద వరద స్వామికి పీఠాధిపతి స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తిని అలంకరించి సూర్య ప్రభ వాహనంపై కొలువుంచి ప్రత్యేక పూజలు చేసి అనంతరం అహోబిలం మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.

రైల్వే లైన్ భూసేకరణను అడ్డుకున్న రైతులు

- అరెస్టు.. పోలీస్ పహారాలో బలవంతపు భూసేకరణ - ఉద్రిక్తంగా సర్వే

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని జయజ్యోతి సిమెంట్ ఫ్యాక్టరీ రైల్వే లైన్ కోసం బలవంతపు భూసేకరణ చేశారు. మంగళవారం మండలంలోని యనకండ్ల గ్రామంలోని జయజ్యోతి సిమెంట్ ఫ్యాక్టరీ భూసేకరణ కోసం డోన్ ఆర్డీఓ వెంకటరామిరెడ్డి, డోన్ డిఎస్పి శ్రీనివాసరెడ్డిల ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు వచ్చారు. బనగానపల్లె రైల్వే స్టేషన్ నుండి జయ జ్యోతి సిమెంట్ ఫ్యాక్టరీకి రైల్వే లైన్ కోసం భూసేకరణ చేశారు. రైతులు భూసేకరణను అడ్డుకున్నారు. రైతులను పోలీసులు అరెస్టు చేసి భూ సేకరణ చేశారు. ప్రైవేట్ కంపెనీకి అధికారులు బలవంతంగా భూసేకరణ చేయడం దారుణమని రైతులు సాంబశివారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగసుబ్బయ్యలు పేర్కొన్నారు. భూమి ధర నిర్ణయించకుండా అధికారులు బలవంతంగా భూసేకరణ చేస్తున్నారని రైతులు ఆరోపించారు. ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీకి భారీ పోలీసు బందోబస్తు భూసేకరణ చేయడం రైతులను బలవంతంగా అదుపులోనికి తీసుకోవడం దారుణం అన్నారు. రైతులు భారీ ఎత్తున మొహరించారు. పోలీసులకు, రైతులలకు మధ్య వాగ్వాదం పరస్పర తోపులాటలు జరిగాయి. రైతులను పోలీసు బలగాలు అడ్డుకొని అదుపులోకి తీసుకొని బలవంతంగా రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. బనగానపల్లె రైల్వే స్టేషన్ నుండి పండ్లాపురం, వెంకటాపురం, యనకండ్ల గ్రామాలకు చెందిన రైతుల పొలాల్లో నూతనంగా రైల్వే లైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది.రైల్వే లైన్ నిర్మాణానికి సంబంధించి జయ జ్యోతి సిమెంట్ ఫ్యాక్టరీకి తమ భూములు ఇచ్చే ప్రసక్తి లేదని, ధర నిర్ణయించిన తర్వాతనే భూ సేకరణ చేయాలని రైతులు పట్టుపట్టారు. రైల్వే లైన్ నిర్మాణానికి సంబంధించి సర్వే పనులు చేపట్టేందుకు, భారీ ఎత్తున పోలీసు బలగాలను రంగంలోకి దించారు. రైతుల పొలాల్లో పెద్ద ఎత్తున పోలీసులు మొహరించడంతో పోలీసులు రైతులకు మధ్య వాగ్వాదం పరస్పర తోపులాట జరగటంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా ఆర్డీఓ వెంకటరామిరెడ్డి మాట్లా డుతూ తాము రైల్వే లైన్ కోసం భూసేకరణ చేస్తున్నామని, భూ సేకరణ తర్వాత రైతుల భూములకు ధర నిర్ణయిస్తామని తెలిపారు. గతంలో సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణానికి సంబం ధించి భూమి కోల్పోయిన రైతులకు కంపెనీ యాజమాన్యం తీవ్ర అన్యాయం చేసిందని, రైతులు భూములు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేయకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. గత ఆరు నెలల క్రితం కూడా రైల్వే లైన్ నిర్మాణానికి సంబంధించి భూమి సర్వే పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అయితే భూమి సర్వే పనులు కొనసాగకుండా రైతులు అడ్డుకోవడంతో అప్పట్లో అధికారులు వెనుతిరిగి వెళ్ళారు.

రైతులను అరెస్టు చేస్తున్న పోలీసులు



ఆర్‌డిఒతో మాట్లాడుతున్న రైతులు

పట్టుబడిన గంజాయి కాల్చివేత

గంజాయిని కాల్చివేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎన్‌డిపిఎస్ కేసులలో పట్టుకొన్న గంజాయి 720 గ్రాములు, పాణ్యం పోలీసు స్టేషన్ పరిధిలో 20,780 కేజీల సీజ్ చేసిన గంజాయిని మంగళవారం డిస్ట్రిక్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మెన్ జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాల పట్టణం బయట అయ్యలూరిమెట్ట సమీపంలో విజయపాల డైరీ కేంద్రంకి ఎదురుగా గల ఖాళీ స్థలంలో సంబంధిత అధికారుల అనుమతితో డిస్ట్రిక్ డ్రగ్ దిస్పోజల్ కమిటీ మెంబర్ ఎస్సీ, ఎస్టీ డీస్పీ రామంజి నాయక్ ఆద్వర్యంలో కాల్చివేశారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.7 లక్షలు వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి ఇన్స్పెక్టర్ జయరాములు తదితరులు పాల్గొన్నారు.

ఇదేం ఖర్మ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

శ్రీశైలం శ్రీగిరి కాలనీలో 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం లోని శ్రీగిరి కాలనీలో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి మంగళవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం టిడిపి తరపున పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని గెలిపించాలని పట్టభద్రులను కోరారు. అనంతరం శ్రీశైలం ఆటో యూనియన్ సభ్యులు టిడిపిలో చేరారు.

ట్రస్టు బోర్డు మెంబర్ పద్మజ తాత్కాలిక తొలగింపు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్‌గా కొనసాగుతున్న బి పద్మజను తాత్కాలింగా పదవి నుంచి తప్పిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు మంగళవారం జారీ అయ్యాయి. గత నెలలో ట్రస్ట్ బోర్డు మెంబర్ బి.పద్మజ టికెట్లు లేకుండా స్వామివారి గర్భాలయ అభిషేకాలు చేయిస్తానని దళారికి చెబుతున్న ఆడియో వైరల్‌గా మారడంపై దేవదాయ శాఖ కమిషనర్ ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి - రుద్రవరం

ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని దొర్నిపాడు మండలంలోని పాడి రైతులకు బోనస్ పంపిణీ చేసినట్లు దొర్నిపాడు మండలం విజయపాల డైరీ మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విజయ పాల డైరీకి పాలు పోసిన రైతులకు లీటరుకు రూ 2 రూపాయల ప్రకారం పంపిణీ చేస్తున్నామన్నారు. నర్సిపల్లి గ్రామంలో రూ.65 వేలు, ఉయ్యాలవాడ మండలం నంది పల్లెలో రూ. 1 లక్ష 50 వేలు, అంబిరెడ్డి నగర్, పడిగపాడు గ్రామాల్లో రూ. 1 లక్ష 50 వేలు చొప్పున బోనస్ రైతులకు పంపిణీ చేశామన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ చేస్తున్న మేనేజర్ శ్రీనివాసులు

లారీ డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.శివరాం

ప్రజాశక్తి-డోన్

లారీ డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.శివరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం డోన్ మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లారీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని,మెరుగైన వైద్య సౌకర్యాలు,ప్రమాదాలలో గాయపడిన, మరణించిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వపరంగా ఆర్థిక సహకారం, వారి పిల్లల ఉన్నత చదువులకు స్కాలర్ షిప్ లు తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. నిత్యావసర వస్తువులు ప్రతి వ్యక్తికి అందేలా చేస్తూ, దేశ ఆర్థిక వృద్ధిలో కూడా ప్రధాన భూమిక పోషిస్తున్న డ్రైవర్ల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రధాన రహదారుల వెంట విశ్రాంతి గదులు, స్నానపు గదులు, వైద్య సౌకర్యాలు, కనీసం మంచినీటి సౌకర్యాలు కూడా కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ వారి హక్కులను హరించి వేస్తున్న కేంద్ర ప్రభుత్వం కార్మికులను యాజమాన్యాలకు బానిసలుగా మార్చే విధానాలు అవలంబిస్తూ చట్టాలను చేస్తున్నదని దీనికి రాష్ట్ర ప్రభుత్వం వంత పాడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలలో వాగ్దానాలు తప్ప కార్మిక వర్గానికి ఈ ప్రభుత్వాలు చేసింది శూన్యం అని అన్నారు. కార్మిక వర్గం ఇప్పటికైనా మేలుకోవాలని కార్మిక, కర్షకుల పక్షాన, ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగుల పక్షాన, పేద ప్రజల పక్షాన నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్న కత్తుల లాంటి ఉద్యమ నాయకులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నాగమద్దయ్య, కమిటీ సభ్యులు ఆదినారాయణరెడ్డి, శివరంగస్వామి, ధనుంజయ గౌడ్, మహానంది, జబ్బార్‌మియా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

పశుగ్రాసం దగ్ధం

ప్రజాశక్తి - చాగలమర్రి : చాగలమర్రి పట్టణంలోని అడ్డవాగు సెంటర్ నుండి ఈద్గాకు వెళ్ళే రహదారి సమీపంలో మంగళవారం ప్రమాదవశాత్తూ జరిగిన అగ్నిప్రమాదంలో పశుగ్రాసం దగ్ధమయింది. పట్టణానికి చెందిన మహమ్మద్ గౌస్ కల్లంలో గడ్డివాము వేసేందుకు తరలించిన జొన్న చొప్ప, వరిగడ్డి ఈ ప్రమాదంలో దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న ఆళ్ళగడ్డ అగ్నిమాపక దళం సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. సుమారు రూ 30 వేల దాకా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

మినుము నూర్పిడి యంత్రం బోల్తా పడి ఇద్దరు మహిళా కూలీలు మృతి

ప్రజాశక్తి - నందికొట్కూరు

మండలంలోని శాతనకోట గ్రామంలో మినుము పంట నూర్పిడి చేసే యంత్రం బోల్తా పడి వ్యవసాయ కూలీలు నాగలక్ష్మి(43), అనురాధ(25) అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. మంగళవారం ఉదయం వ్యవసాయ పొలంలో కూలి పని నిమిత్తం మినుము కట్టే పట్టేందుకు ఐదు మంది మహిళా కూలీలు వెళ్లారు. పని ముగించుకొని ఇంటికి మిషన్ మీద ఎక్కి తిరిగి ప్రయాణమైన కొద్దిసేపటికే ప్రమాదవశాత్తు మిషన్ బోల్తా పడి ఇద్దరు మహిళలు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని బ్రాహ్మణకొట్కూరు సిఐ సుధాకర్ రెడ్డి, ఎస్సై ఓబులేసు, సర్పంచ్ జనార్దన్ గౌడ్, నందికొట్కూరు పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మృతి చెందిన మహిళా కూలీలు

రూ. 69.715 కోట్లతో నంద్యాల మున్సిపల్ బడ్జెట్

- రెవెన్యూ సేకరణకు కౌన్సిల్ సమావేశం తీర్మానం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యా మున్సిపల్ బడ్జెట్ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 69.715 కోట్లకు కౌన్సిల్ సమావేశం ఆమోదం తెలిపింది. ఈ ఆదాయాన్ని సేకరించేందుకు ప్రధానంగా ఆస్తి, ఖాళీ స్థలాలపై పన్ను, అడ్వర్టైజ్మెంట్ సినిమా హాల్స్, హోర్డింగ్స్, స్టాంప్ డ్యూటీ, వాటర్ చార్జీలు, టౌన్ ప్లానింగ్ తదితర వాటి ద్వారా మున్సిపాలిటీకి ఆదాయాన్ని రాబట్టేందుకు ఈ బడ్జెట్ లో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మంగళవారం నంద్యాల మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా అధ్యక్షతన నంద్యాల మున్సిపల్ బడ్జెట్ సమావేశం జరిగింది. చైర్మన్ అనుమతితో మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్ర రెడ్డి బడ్జెట్ వివరాలను సమావేశంలో వెల్లడించారు. ఆస్తి పన్నుల ద్వారా రూ.20 కోట్లు, ఖాళీ స్థలాలపై వేసే పన్నుల ద్వారా రూ.50 కోట్లు, అడ్వర్టైజ్మెంట్ సినిమా హాల్స్, హోర్డింగ్స్ ద్వారా రూ.16.75 కోట్లు, స్టాంప్ డ్యూటీ ద్వారా రూ.7 కోట్లు, షాపింగ్ కాంప్లెక్స్ అద్దెల ద్వారా రూ.4 కోట్లు, వాటర్ చార్జీలు రూ.3.50 కోట్లు, టౌన్ ప్లానింగ్ నుండి రూ.3.11 కోట్లు, మార్కెట్‌లో షాప్‌ల వేలం పాట ద్వారా రూ.8.79 కోట్లు తదితర వాటి ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. అలాగే వచ్చిన ఆదాయంలో అప్కస్ వేసేజ్‌కు రూ.15,28,50 కోట్లు, విద్యుత్ చార్జీలకు రూ.5.95 కోట్లు, మున్సిపల్ వాహనాలు, తదితర వాహనాలకు డీజిల్, పెట్రోల్ ఖర్చులు రూ.1,53,70 కోట్లు, రోడ్లు మెయింటెనెన్స్ డ్రైనేజీ కాలువల పనులకు రూ.5.50 కోట్లు, వాటర్ సప్లై రిపేర్లకు రూ.1.10 కోట్లు, హైయర్ చార్జీలు, బాడుగలకు రూ.43.50 కోట్లు, బహిరంగ టాయిలెట్స్, మూత్రశాలలకు రూ.93 లక్షలు, ఇతర వివిధ రకాల పనులకు రూ.8,96,57 కోట్లు, అమృత్ లోన్‌కు ఈఎంఐ కింద చెల్లింపులు రూ.7,06,48 కోట్లు, మొత్తం రూ.45,82,70 కోట్లు ఖర్చుల పద్దు కింద చూపారు. అలాగే మూలధనం రాబడి కింద 15వ ఫైనాన్స్ కింద రూ. 11 కోట్లు, జిజిఎంపి కింద రూ.8.60 కోట్లు, ఇతర గ్రాంట్స్ రూ.3.5 కోట్లు కాగా అందులో ఖర్చులు సిసి రోడ్లు, డ్రైనేజి కాలువల పనులకు రూ.9.70 కోట్లు, మేజర్ డ్రైనేజి కాలువలకు రూ.2.50 కోట్లు, వాటర్ ఈఎస్ఆర్‌కు రూ.4.70 కోట్లు, ఇతర పద్దుల కింద పనులకు రూ.4.05 50 కోట్లు మూల ధనం ఖర్చుల కింద చూపించారు. వీటిలో వాటర్ సప్లైకి 20 శాతం, డ్రైనేజీకి 13 శాతం, రోడ్స్‌కు 19 శాతం స్ట్రీట్ లైట్స్‌కు 7 శాతం, పార్కుల అభివృద్ధికి 10 శాతం, మార్కెట్లు, పార్కులు, బిల్డింగ్స్ కమ్యూనిటీ హాల్స్, మరుగుదొడ్లు మూత్రశాలలకు 17 శాతం నిధులు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే దళిత వాడలకు 15 శాతం, గిరిజన వాడలకు 7.50 శాతం, మహిళ శిశు అభివృద్ధి సంక్షేమానికి 5 శాతం, వికలాంగులకు 3 శాతం బడ్జెట్లో నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు.

బడ్జెట్ వివరాలు వివరిస్తున్న కమిషనర్ సి.రవిచంద్ర రెడ్డి

నా వార్డుకు బడ్జెట్ కేటాయించడం లేదు.. అన్యాయం జరిగింది.
తెలుగుదేశం కౌన్సిలర్ మహబూబ్ వలి

తెలుగుదేశం కౌన్సిలర్ మాబు వలికి అధికార పక్షం కౌన్సిలర్లకు మధ్య వాగ్వాదం జరిగింది. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ఆమోదం తెలిపిన తర్వాత 38వ వార్డు తెలుగుదేశం పార్టీకి చెందిన కౌన్సిలర్ మాబు వలి తన వార్డుకు నిధులు కేటాయించడం లేదని, ఒక పైసా పని కూడా జరగలేదని బడ్జెట్ కేటాయించాలని చైర్మన్‌ను కోరారు. ఇది కేవలం బడ్జెట్‌కు సంబంధించిన సమావేశం కాబట్టి వచ్చేనెల జరిగే సమావేశంలో సమస్యల గురించి చర్చించుకుందామని చైర్ పర్సన్ అన్నారు. ఇది బడ్జెట్ సమావేశం కదా వాటికి సంబంధించి మాట్లాడకూడదంటే ఎలా అని ప్రశ్నించారు. దీంతో పక్కనే ఉన్న అధికార పక్షానికి చెందిన కౌన్సిలర్లు జోక్యం చేసుకుని ఏ సమయంలో ఏది అని తెలియకపోవడం టిడిపి కౌన్సిలర్‌కు దురదృష్టకరమని, బడ్జెట్ సమావేశాల్లో బడ్జెట్ గురించి మాట్లాడాలన్నారు. దీంతో ఒకరిపై ఒకరు వాదనకు దిగడంతో ఉద్రిక్తంగా మారింది.

వాగ్వివాదం చేసుకుంటున్న కౌన్సిలర్లు

బానులముక్కుల శివారులో పెద్దపులి

– భయాందోళనలో గ్రామస్తులు

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలం బాణముక్కల గ్రామ శివారులో మంగళవారం ఓ మహిళ చాకి రేవుకు వెళ్తుండగా కుంటలో నీళ్లు తాగేందుకు వచ్చిన పులి కనపడింది. దీంతో ఆ మహిళ భయాందోళనకు గురై గట్టిగా కేకలు వేసింది. సమీపంలో ఉన్న వ్యక్తులు మోటార్ సైకిల్‌పై వెళ్తూ ఇటు రాగా పులి అక్కడి నుండి వెళ్లిపోయింది. సమీపంలో ఉన్న ఉపాధి కూలీలు కూడా అందరూ కలిసి గట్టిగా కేకలు వేయడంతో పులి అక్కడి నుండి వెళ్లిపోయింది. పులి సమీపంలోనే తిరగడంతో భానుముక్కల గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఫారెస్ట్ అధికారులు స్పందించి పులి ఇక్కడి నుండి ఫారెస్ట్‌లోకి వెళ్లేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యాప్ లోన్లపై అవగాహన కల్పించండి

ప్రజాశక్తి - గోస్పాడు

యాప్ లోన్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్ఐ కె.వి మల్లికార్జున గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం గోస్పాడు పోలీస్ స్టేషన్లో గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రజలను వివిధ రకాలుగా సైబర్ క్రైమ్ నేరగాళ్లు మోసం చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. సచివాలయం సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఐదుగురు నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలం గోపవరం గ్రామంలో ఈ నెల 13న జరిగిన ఘర్షణలో అదే గ్రామానికి చెందిన చెందిన చెవుల శ్రీనివాసులు భిక్ష గాయాలతో కోలుకోలేక మృతి చెందిన కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ రవీంద్ర తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గోపవరం గ్రామానికి చెందిన తప్పెట పకీరమ్మ, తమ్మడపల్లె గ్రామానికి చెందిన ఐజ నరసింహులు, ఆళ్లగడ్డ మండలం పడకండ్ల గ్రామానికి చెందిన అరటి శివ రాముడు, నల్లగట్లకు చెందిన మనీ మహేష్, పడకండ్లకు చెందిన అరటి నాగలక్ష్మమ్మను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు చెప్పారు. మహానంది హెడ్ కానిస్టేబుల్ ఓబులేసు, కానిస్టేబుల్ శేషన్న తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు తనిఖీ

ప్రజాశక్తి - సిరివెళ్ల

మండలంలోని యర్రగుంట్ల, కామినేనిపల్లి గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలను డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి యం.రవికుమార్ రెడ్డి, సిబ్బంది మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మద్యం దుకాణంలో నిర్ణీత ధరకు మద్యం అమ్మకాలు చేపట్టాలన్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ యం. అస్లాంటిగ్, కానిస్టేబుల్ కల్పన, ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కషి చేస్తామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నల్లగట్ల గ్రామంలోని ఎంపీపీ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, పిఆర్టియు అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షులు భార్గవరామయ్యను కలిసి మాట్లాడారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈయన వెంట ఆపుష్మ నంద్యాల డివిజన్ అధ్యక్షులు అమీర్ భాష ఉన్నారు. **చాగలమర్రి :** పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న మిట్టా వెంకట రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు రవీంద్రారెడ్డి, ఆంజనేయులు, మౌలాలి, శివరామచంద్రన్‌లు కోరారు. చాగలమర్రి మండలంలో పీఆర్టీయూ నాయకుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని చిన్నవంగలి, చింతల చెరువు, పెద్దబోధనం, గొడిగనూరు, ముత్యాలపాడు, మద్దూరు, చాగలమర్రి పట్టణంలోని ఉన్నత పాఠశాలల్లో పాటు కస్తూరిభా తదితర ప్రయివేటు పాఠశాలలోని ఉపాధ్యాయులను కలసి మొదటి ప్రాధాన్యత ఓటు రామచంద్రారెడ్డికి వేసి గెలిపించాలని కోరారు.

ప్రశ్నించే గొంతుకలనే గెలిపించండి

(5వ పేజీ తరువాయి..) అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. **ఆత్మకూర్ :** పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహ రెడ్డి, పోతుల నాగరాజుల గెలుపును ఆకాంక్షిస్తూ మండల పరిధిలోని నల్ల కాలువ, బాపనంతాపురం, సిద్ధాపురం, సిద్దపల్లె, ముష్టపల్లె, కొత్త రామాపురం, కరివేన గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ నాయక్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, రైతు సంఘం మండల అధ్యక్షులు మాభాష, వత్తిదారుల సంఘం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అలాగే ఆత్మకూరు పట్టణంలోని స్వరాజ్ నగర్, ఎస్ పి జి పాలెం, ఏబీఎం పాలెం, గొల్లపేట, రజక వీధులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డివైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు ఏ.రణధీర్, సిఐటియు పట్టణ కార్యదర్శి డి. రామ్ నాయక్, వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు చంద్రా వారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **గోస్పాడు :** గోస్పాడు మండలం ఎం చింతకుంట్ల గ్రామంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోతుల నాగరాజుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ చెన్నయ్య, ఏపి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.మార్కు, వ్యకాసం సభ్యులు కరిముల్లా, కెవిపిఎస్ జిల్లా నాయకులు బాల చెన్నయ్య పాల్గొన్నారు. **శ్రీశైలం :** పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని సిఐటియు జిల్లా నాయకులు మునిపాటి చిన్న మారెన్న కోరారు. అభ్యర్థులు కత్తి నరసింహ రెడ్డి, పోతుల నాగరాజులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ శ్రీశైలంలో, సున్నిపెంటలో ప్రచారం నిర్వహించారు. ఆయన మల్లికార్జున, నాగ వెంకటేశ్వర్లు, జి.మల్లికార్జున, యం.ప్రభాకర్, బాలరాజు, మౌలాలి, మనోహర్, వెంకటేష్, రామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ప్యాపిలిలో...

'గురురాజా'లో ముగిసిన సైన్స్ ఎక్స్‌పో

– అతిథులను ఆకట్టుకున్న విద్యార్థుల ప్రయోగాలు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని ఎన్జీవో కాలనీ శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సైన్స్ ఎక్స్ పో వైభవంగా ముగిసింది. పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలు అతిథులను ఆకట్టుకున్నాయి. శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాల డైరెక్టర్ పి షేక్షావలి రెడ్డి అధ్వర్యంలో ముగింపు సైన్స్ ఎక్స్పో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంక్ బ్యాంకింగ్ కోచింగ్ చైర్మన్ డాక్టర్ పి దస్తగిరి రెడ్డి, శ్రీ రామకృష్ణ కళాశాలల చైర్మన్ డాక్టర్ జి రామకృష్ణారెడ్డి, అడిషనల్ డిస్ట్రిక్ట్ ఫైర్ అధికారి యోగేశ్వర్ రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పి మౌలాలి రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు చంద్రమోహన్, మనోహర్ రెడ్డి, శివ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. రెండు రోజుల సైన్స్ ఎక్స్పో కార్యక్రమంలో అత్యంత ఆకర్షణగా నిలిచిన ప్రదర్శనలకు బహుమతులను అతిథులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్లు పి.మౌలాలి రెడ్డి, పి. షేక్షావలి రెడ్డి, పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తనిఖీ చేస్తున్న ఆర్డిఓ

నిబంధనలు అతిక్రమిస్తే వేటు తప్పదు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

సచివాలయ ఉద్యోగులు నిబంధనలను అధిక్రమిస్తే వేటు తప్పదని ఆత్మకూరు ఆర్డీవో దాస్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఒకటవ సచివాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు నిబంధనలను అతిక్రమించి డ్రెస్ కోడ్ లేకుండా, రికార్డులను సరిగా మెయింటైన్ చేయడం లేదన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు అత్యంత దగ్గరగా చేరవేయాలని ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. త్వరలోనే అన్ని గ్రామ సచివాలయాలను తనిఖీ చేస్తామన్నారు. సచివాలయ ఉద్యోగులను నియంత్రించాల్సిన పంచాయతీ కార్యదర్శులు కూడా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్వో ఏసుపాదం, పంచాయతీ కార్యదర్శి నటరాజు తదితరులు పాల్గొన్నారు.

మహానందీశుని హుండీ కానుకలు లెక్కింపు

ప్రజాశక్తి - మహానంది

ప్రముఖ శైవక్షేత్రం మహానంది పుణ్యక్షేత్రంలో ఉభయ దేవాలయంల హుండీ లెక్కింపు ప్రక్రియ మంగళవారం ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో క్షేత్రంలోని అభిషేక మండపంలో నిర్వహించారు. ఆలయ ఈవో మాట్లాడుతూ ఉభయ దేవాలయాల హుండీ లెక్కింపు ద్వారా రూ. 47 లక్షల 84 వేలు, అన్నదానం హుండీ ద్వారా రూ.66 వేలు, గోశాల హుండీ ద్వారా రూ. 26 వేలు ఆదాయం వచ్చినట్లుగా తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వాలంటీర్లు, భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు

ఎద్దుల కొట్టం దగ్ధం

ప్రజాశక్తి - ప్యాపిలి

మండలంలోని నల్లబల్లి రోడ్డు పొలాల్లోని భావిపల్ల వెంకటేష్ రైతుకు చెందిన ఎద్దుల కొట్టంను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం తెల్లవారుజామున దగ్ధం చేశారు. ఈ ఘటనలో ఎద్దులు గాయపడ్డాయి. పైపులు, ఎరువులు, సామాగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. రైతుకు దాదాపు రూ. 3 లక్షల వరకు నష్టం వాటిల్లింది. రైతును ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి నాయకులు ఎర్రగుంట్లపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, రైతులు కోరారు.

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గడ్డం రామకృష్ణారెడ్డి ఎన్నిక

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కోయిలకుంట్ల పట్టణానికి చెందిన గడ్డం రామకృష్ణారెడ్డి ఎన్నికయినట్లు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బనగానపల్లె పట్టణంలోని టిడిపి కార్యాలయంలో గడ్డం రామకృష్ణారెడ్డిని మాజీ ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. ముందుగా గడ్డం రామకృష్ణారెడ్డి మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి ఆయనను గజ మాలతో సత్కరించారు. అనంతరం గడ్డం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు అచ్చెన్నాయుడు, బనగానపల్లె మాజీ శాసనసభ్యులు బీసీ జనార్ధన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం నాగేశ్వర్రెడ్డి, గడ్డం అమర్నాథ్ రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, కోయిలకుంట్ల పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న గడ్డం రామకృష్ణారెడ్డి

మెరుగైన సర్వీసులు అందించండి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన రీతిలో సర్వీసులు అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ ఎంపీడీవోలను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వైయస్సార్ సెంటినరీ హాలులో ఏపీ సేవా సర్వీసులు, గృహ నిర్మాణాల పురోగతి, ఉపాధి కూలీల పెంపు తదితర అంశాలపై ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది అటెండెన్స్ ఇన్ టైం, అవుట్ టైంలలో ప్రగతి కనపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జగనన్న తోడు కింద లబ్ధిదారుల గురించి సంబంధిత జాబితాను బ్యాంకర్లకు అందజేయాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన పనులకు ఎస్టిమేట్ ప్రతిపాదనలు సమర్పించడంతో పాటు చేపట్టిన పనులకు బిల్స్ అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ స్కీమ్ కింద 40 శాతం పెండింగ్లో ఉన్న ఈకేవైసీని పూర్తి చేయించాలని ఆదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డులు తీసుకున్న వాళ్ళు పనులకు వచ్చేలా చర్యలు తీసుకొని లేబర్ రిపోర్ట్‌ను పెంచాలని డ్వామా పిడిని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. జగనన్న లేఔట్లలో రూఫ్ స్థాయి, ఆర్.సి స్థాయిలో వున్న 4,400 ఇళ్లు ఉగాది నాటికి పూర్తి చేయాలని సంబంధిత హౌసింగ్ ఇంజినీర్లు, ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సిఈఓ సుబ్బారెడ్డి, డ్వామా పిడి రామచంద్రారెడ్డి, డిఆర్డిఏ పీడి శ్రీధర్ రెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ మనోహర్, హౌసింగ్ ఈఈ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - నందికొట్కూరు

ఎస్సి, ఎస్టిలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విద్యుత్ అధికారి ఏడిఏ.శ్రీనివాసులుకు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిందని, ఆ హామీ పూర్తిగా అమలు చేయాలన్నారు. మిడుతూరు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన ఎస్సి పాల గురుడుకు 2018 నుండి ఇప్పటి వరకు 21 వేలు బిల్లు ఉన్నట్టు మీటర్ రీడింగ్‌లో వచ్చిందన్నారు. స్థానిక లైన్మెన్లు, బిల్ కలెక్టర్ ఏమాత్రం పట్టించుకోకుండా 2023లో 13 వేల రూపాయలు కడితే రద్దు చేస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ నిరుపేదలకు గతంలో దీన్ దయాల్ స్కీం కింద ఉచితంగా విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చారని, దానిని తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు టౌన్ కార్యదర్శి గోపాలకృష్ణ, వ్యకాసం మండల కార్యదర్శి ఓబులేష్, కెవిపిఎస్ జిల్లా నాయకురాలు హుస్సేనమ్మ, మహిళా సంఘం నాయకురాలు ఎస్.బిబి, నాయకులు డక్క కుమార్, లబ్దిదారుడు పాల గురుడు, ప్రజాసంఘాల నాయకులు నరసింహులు, వేల్పుల ఏసన్న, నారాయణ, లింగన్న, కరీం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

టైలర్లకు రూ. లక్ష విరాళం

ప్రజాశక్తి - కోయిలకుంట్ల

పట్టణ శివారులోని పీరా బిల్డింగ్‌లో టైలర్స్ డే సందర్భంగా న్యూ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు ప్రవాసాంధ్రుడు డాక్టర్ గురు రాజా లక్ష రూపాయలు విరాళాన్ని మిత్ర మండలి సభ్యులు జగన్నాథరెడ్డి, గడ్డం రామకృష్ణారెడ్డి, గడ్డం నాగేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అహ్మద్ హుసేన్ మాట్లాడుతూ విరాళాన్ని అందించిన డాక్టర్ గురు రాజాకు ధన్యవాదాలు తెలిపారు. ఎస్ఏ రసూల్, సుబ్బారెడ్డి, కమలహాసన్, కాజా, ముస్కిన్ వలి, టైలర్లు పాల్గొన్నారు.

విరాళాన్ని అందిస్తున్న డాక్టర్ గురు రాజా మిత్రమండలి సభ్యులు

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ దేవికి మంగళవారం కొబ్బరికాయల సమర్పణ కార్యక్రమం నిర్వహించారు. చైత్రమాసంలో పౌర్ణమి తర్వాత వచ్చే మంగళవారం లేదా శుక్రవారం భ్రమరాంబ దేవికి కుంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తారు. ఏప్రిల్ 11న ఈ కుంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో అమ్మవారికి సాత్విక బలి నిర్వహించేందుకు గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, నిమ్మకాయలు సమర్పిస్తారు. స్త్రీ వేషంలో ఉన్న ఒక పురుషుడు కుంభ హారతి సమర్పించడం ఈ ఉత్సవంలో ప్రధాన ఘట్టం. ఈ కుభోత్సవాన్ని పురస్కరించుకొని మహాశివరాత్రి తర్వాత వచ్చే ప్రతి మంగళవారం, శుక్రవారం అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ కార్యక్రమం జరుగుతుంది. ఇందులో భాగంగానే ఉదయం కొబ్బరికాయలు, పసుపు కుంకుమ అమ్మవారికి సమర్పించారు.

మౌలానా అబ్దుల్ మజీద్ ఆరిఫ్‌కు సన్మానం

ప్రజాశక్తి - చాగలమర్రి

స్థానిక మల్లెవేముల రస్తాలోని అష్రాపుల్ ఉల్ ఉలుం మదరసాలో ప్రిన్సిపల్ మౌలానా ఖలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆలిండియా నేషనల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ మౌలానా అబ్దుల్ మజీద్ ఆరిఫ్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. మార్చి 1న మక్కాయాత్రకు బయలుదేరి వెళుతున్న సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మౌలానాలు సులేమాన్, సుబహాన్, హకీమ్, రియాజ్, అబ్దుల్ ఖాదర్, నసీబ్, మత పెద్దలు, ప్రముఖులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి : వైసిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల

రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని వైఎస్ఆర్సిపి మండల నాయకులు మురళీకృష్ణ, తిరుమలేశ్వర్ రెడ్డిలు పట్టభద్రులను కోరారు. మంగళవారం మండలంలోని గోరుమానుకొండ, ముద్దవరం, పెద్ద కొలుములపల్లి, ఎం పెండకల్, సీతారామపురం, పైతల గ్రామాలలో వైసిపి నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ జరిగే ఎన్నికల్లో వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వెంకటేశ్వర్లు, రామానాయుడు, తిరుమల వెంకటేశ్వర రెడ్డి, శేఖర్, మురళి, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A No. 113/2018 in O.S.No. 42/2018

B.ఎల్లయ్య S/o చిన్న నాగన్న 65 సంవత్సరములు వయసు R/O గొల్లపేట, కొత్త పల్లి గ్రామము & మండలము నంద్యాల జిల్లా. ...వాది

V/s

గౌరు అంకి రెడ్డి died by L. R. S
1) గౌరు చంద్రశేఖర్ రెడ్డి S/o నారాయణ 75 సం॥లు వయసు, వ్యాపారము
2) గౌరు రతమ్మ w/o చంద్రశేఖర్ రెడ్డి 70 సం॥లు వయసు, house wife
3) గౌరు సాయమ్మ W/o అంకి రెడ్డి 50 సం॥లు వయసు, house wife
4) గౌరు చరిత D/o late గౌరు అంకి రెడ్డి 33 సం॥లు వయసు
5) గౌరు ధనుంజయ రెడ్డి S/o late అంకి రెడ్డి 30 సం॥లు వయసు, వ్యాపారము.

...ప్రతివాదులు

ప్రతివాదులు NO 1 to 5 నివాసం కొత్త పల్లి గ్రామము & మండలము, నంద్యాల జిల్లా.

ప్రతివాదులకు నోటీసు R4 & R5

ఈ నెంబర్ లో పిటిషనరు/వాది పేర రెస్పాండ్స్/ప్రతివాదుల యొక్క తండ్రి లేటు గౌరు అంకిరెడ్డి వ్రాయించి ఇచ్చిన ప్రామిసరీ నోటును బట్టి దావా మొత్తము Rs.02, 29, 970.00 రాబటు కొనుటకు పై, నెంబరు పిటిషన్ షెడ్యూలు దాఖలా ఆస్తి జప్తు కోరి పై నెంబరు I.A 113/2018 దాఖలు చేసి ఉన్నాడు. అయితే రెస్పాండేంట్సు /ప్రతివాధులు అయిన నెంబరు 4 గౌరు చరిత మరియు నెంబర్ 5 గౌరు ధనుంజయ రెడ్డి మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల 02/03/2023 వ తేదీన ఉదయం 10:30 నిమిషాలకు పై కోర్టులో హాజరు అయి దావా మొత్తము Rs.2,29,970.00 లకు తగిన జామీను ఇవ్వనంతట నీపరోక్షమున తీర్మానించి. ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని జప్తు చేయబడును.

షెడ్యూలు

The property in situated in Erramattam Village, with in the limits of Atmakur sub- Registration, Nandyal Registration dist. bearing the following particulars:-
S.No:- 135/A pyki Extent of A.C 4.60 cents
Boundaries:-
East :- Land of Venkata Subba Reddy
West :- Land of Pedda Sivaiah and others
North:- land of Musalaiah Gari Bakkanna and Others
South :- land of Rosanna and others

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

D.వెంకట రమణ,
B.Com. LLB. B.Ed,
వాది తరపున న్యాయవాది
ఆత్మకూరు, నంద్యాల జిల్లా
Cell:- 9391504418

ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం

నంద్యాల జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో జాతీయ విజ్ఞాన దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది.

రుద్రవరం : రుద్రవరంలోని చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సైన్స్ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సివి రామన్ చిత్రపటానికి పాఠశాల హెడ్ మాస్టర్ వర ప్రసాద్ పూలమాల వేసి నివాళు లర్పించారు. విద్యార్థులు చార్ట్స్, సైన్స్ ప్రాజెక్ట్‌లను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరళ, ఉసేని, విజయ, షబానా, మహాలక్ష్మీ, భాగ్యశ్రీ, ఖైరునిసా బేగం, సౌజన్య, సునంద, శశి బాయ్, విద్యార్థులు పాల్గొన్నారు. **ప్యాపిలి :** విద్యార్థినీ విద్యార్థులలో ప్రాథమిక స్థాయి నుండే సైన్స్ పైన అవగాహన ఉండాలని జక్కసానికుంట్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలోని 5 వ తరగతి విద్యార్థులు కొన్ని ప్రయోగాలు చేసి చూపారు. **ఆళ్లగడ్డ :** విద్యార్థులు సైన్స్ ప్రాముఖ్యతను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆపుస్మ నంద్యాల డివిజన్ అధ్యక్షులు అమీర్ భాష అన్నారు. పట్టణంలోని అరుణోదయ యూపీ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవమును పురస్కరించుకొని వైజ్ఞానిక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఈఓ శోభా వివేకవతి ప్రారంభించారు. హెచ్ఎం ఇమామ్ హుస్సేన్, ఆసియా బేగం, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోని ప్రభుత్వడిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. స్వర్ణలతాదేవి ఆధ్వర్యంలో భౌతికశాస్త్ర విభాగం జాతీయ సైన్స్ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. సర్ సివి. రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐక్యూఏసి, సమన్వయకర్త డాక్టర్ కే.బడేసాహెబ్, అధ్యాపకులు పాల్గొన్నారు. **అవుకు :** పట్టణంలోని మదర్ మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జాతీయ విజ్ఞాన దినోత్సవం ముచ్చలపురి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. **ఆత్మకూర్ :** ఆత్మకూరులోని పుల్లారెడ్డి హై స్కూల్లో, డి పాల్ హై స్కూల్ నందు జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. **పగిడ్యాల :** ప్రతిదీ సైన్స్‌తో ముడిపడి ఉంటుందని ఎంఈఓ సుభాన్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవ పురస్కరించుకొని మండలంలోని పాలమరి గ్రామం ఎంపీపీ పాఠశాలలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. **కోవెలకుంట్ల :** స్థానిక ప్రభుత్వఉన్నత పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం జరిగింది. ఎంఇఒ తిమ్మారెడ్డి అధ్యక్షతన సివి రామన్, అబ్దుల్ కలాం ల చిత్రపటాలకు నివాళు లర్పించారు. అలాగే పట్టణంలోని ప్రగతి పబ్లిక్ స్కూల్‌లో నేషనల్ సైన్స్ డే వేడుకలను ఘనంగా జరిపారు. కరెస్పాండెంట్ ఎస్ఏ గఫూర్ మాట్లాడారు. హెచ్ఎం ఆరీఫాబేగం, ఉపాధ్యాయులు రామసుబ్బారెడ్డి, శీలారెడ్డి, సుభాష్, వెంకటేశ్వర్లు, సుగుణ ,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **మహానంది :** మండలంలోని కస్తూరిబా పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఇన్చార్జి ఎస్ఓ విజయలక్ష్మి సైన్సు ఉపాధ్యాయురాలు వసంతకుమారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

బాల అకాడమీ పాఠశాలలో

నంద్యాల : నంద్యాల పట్టణంలోని పార్క్ రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలో నేషనల్ సైన్స్ డే పురస్కరించుకుని సైన్స్ ఫెయిర్ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత పాల్గొన్నారు. సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **శ్రీ రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో :** స్థానిక శ్రీ రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో నేషనల్ సైన్స్ డే ను నిర్వహించారు. కార్యక్రమం కళాశాల చైర్మన్ జి. రామకృష్ణ రెడ్డి, డైరెక్టర్ జి హేమంత్ రెడ్డి పర్యవేక్షణలో జరిగింది. నంద్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రభాకర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు.



పగిడ్యాలలో...

రుద్రవరంలో..

కోవెలకుంట్లలో..

నంద్యాల : బాల అకాడమిలో...

శ్రీ రామకృష్ణ కళాశాలలో...

మహారాజశ్రీ ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No. 42/2018

B.ఎల్లయ్య S/o చిన్న నాగన్న 65 సంవత్సరములు వయసు R/O గొల్లపేట, కొత్త పల్లి గ్రామము & మండలము నంద్యాల జిల్లా. ...వాది

V/s

గౌరు అంకి రెడ్డి died by L.R.S
1) గౌరు చంద్రశేఖర్ రెడ్డి S/o నారాయణ 75 సం॥లు వయసు, వ్యాపారము
2) గౌరు రతమ్మ w/o చంద్రశేఖర్ రెడ్డి 70 సం॥లు వయసు, house wife
3) గౌరు సాయమ్మ W/o అంకి రెడ్డి 50 సం॥లు వయసు, house wife
4) గౌరు చరిత D/o late గౌరు అంకి రెడ్డి 33 సం॥లు వయసు,
5) గౌరు ధనుంజయ రెడ్డి S/o late అంకి రెడ్డి 30 సం॥లు వయసు, వ్యాపారము

ప్రతివాదులు NO 1 to 5 నివాసం కొత్త పల్లి గ్రామము & మండలము, నంద్యాల జిల్లా. ...ప్రతివాదులు

4,5 ప్రతివాదులకు కోర్టు సమన్ల పబ్లికేషన్

వాది, ప్రతివాదుల యొక్క తండ్రి గౌరు అంకి రెడ్డి వ్రాయించి ఇచ్చిన బాకీ వసూలు కోరి దావా దాఖలు చేయగా కోర్టు వారు మీకు ఎన్ని సార్లు నోటీసులు పంపించిన మీ నుండి ఎటువంటి జవాబు లేనందున పై కోర్టు వారు మీ హాజరుకై వాయిదా 02/03/2023 వ తేదీన ఉదయం 10:30 నిమిషాలకు మీరు గాని మీ తరపు న్యాయవాది గాని హాజరే మీ ఆక్షేపణలు తెలియబరుచుకోనవలెను లేనియెడల మీ పరోక్షములో పై దావాను తీర్మానము జరుగునని ఇందుములంగా మీకు తెలియజేయడమైనది

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా :- 02/03/2023

D.వెంకట రమణ,
B.Com. LLB. B.Ed,
వాది తరపున న్యాయవాది
ఆత్మకూరు, నంద్యాల జిల్లా
Cell:- 9391504418